ప్రభాత
# సూర్య
www.suryaa.news
తెలుగు జాతీయ దిన పత్రిక
వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 11 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 35
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## స్కూళ్లలో రేషనలైజేషన్ రచ్చ

**మెదక్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని, ఇది జూన్ 13వ తేదీ లోపు పూర్తి చేయాలని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులపై ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.బడుల్లో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఈ ఏడాది ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈ సమయంలో సర్దుబాటు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కోల్పోతామని చెబుతున్నారు. తక్షణమే ఉత్తర్వులను రద్దు చేయాలని, కనీసం జూన్ 30 వరకు వచ్చిన ప్రవేశాల ఆధారంగా సర్దుబాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. మొదటి ప్రాధాన్యం పంచాయతీ పరిధి, తర్వాత స్కూల్ కాంప్లెక్స్, ఆ తర్వాత మండలం, అనంతరం జిల్లా పరిధిలో సర్దుబాటు చేసుకోవచ్చు.


విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news




# సీఎం శాఖలు సీనియర్లకు!

- కాంగ్రెస్ హైకమాండ్ సూచన.. ఓకే అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘ భేటీ
- కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు,ప్రస్తుత మంత్రుల శాఖల మార్పుపై ముగిసిన కసరత్తు
- ఏ క్షణమైనా అధిష్టానం నుంచి ప్రకటన... పెద్దల పిలుపుతో ఢిల్లీకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హైదరాబాద్‌లోనే డిప్యూటీ సీఎం భట్టి.. ఫోన్‌లో మంతనాలు.. మూడు, నాలుగు బహిరంగ సభల నిర్వహణకు యోచన


**సూర్య న్యూఢిల్లీ/హైదరాబాద్**

రాష్ట్రంలో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు, ప్రస్తుత మంత్రుల శాఖల మార్పుపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు ముగిసింది. పార్టీలో సీనియార్టీ, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఎవరికి, ఏ శాఖ కట్టబెట్టాలన్న దానిపై ఓ నిర్ణయానికి వచ్చింది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న పలు కీలక శాఖలు ఇతర సీనియర్ మంత్రులకు కేటాయించాలని హైకమాండ్ సూచించినట్లు తెలిసింది. ఇందుకు ముఖ్యమంత్రి కూడా అంగీకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఏ క్షణమైనా శాఖల కేటాయింపు, శాఖల మార్పు ప్రకటన వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. శాఖల కేటాయింపు అంశంపై చర్చించేందుకు సోమవారం ఢిల్లీ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. సుమారు గంటన్నర పాటు శాఖల కేటాయింపుపై చర్చించారు. భేటీలో సీనియర్ మంత్రుల వద్ద, సీఎం వద్ద ఉన్న శాఖలతో పాటు ప్రాధాన్యత గల శాఖలపై కీలక చర్చలు జరిగాయి. హోంశాఖ సహా మునిసిపల్, విద్య, న్యాయ, మైనింగ్ వంటి కీలక శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉన్న - మిగతా2లో



## పిల్లలా... వద్దులే!

- ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి
- ఆర్థిక భారమే ప్రధాన కారణం
- జనాభా వృద్ధిలో భారీ తగ్గుదల
- ఐరాస అంతర్జాతీయ సర్వేలో వెల్లడి



## కుటుంబ వ్యాపారానికి యువతరం నో

- నా దారి నేను చూసుకుంటా..!
- 7% మంది మాత్రమే సంసిద్ధం
- వారసత్వ బదిలీకి 79% యజమానులు రెడీ
- హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ నివేదికలో వెల్లడి

## రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు పెంచాలి


- ఆయిల్‌ఫెడ్‌ను బలోపేతం చేయాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



## భారత్ స్వరాన్ని సగర్వంగా చాటారు

- అఖిలపక్ష బృందాలకు ప్రధాని మోదీ కితాబు
- అఖిలపక్ష బృందానికి నేతృత్వం వహించిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్
- ప్రపంచ దేశాలకు అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలు వివరించిన తీరు తనకెంతో గర్వంగా ఉంది

## విద్యుత్ ఉద్యోగులకు ప్రమాద బీమా రూ.కోటి



- విద్యుత్ సంస్థల్లో పనిచేసే దాదాపు 52 వేల మందికి వర్తింపు
- రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచే కార్యక్రమం: డిప్యూటీ సీఎం భట్టి

## 3 నెలల రేషన్.. ఒకటే నిశాన్

- ఆరుసార్లు వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదు..
- ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు స్థాయిలో 72.83 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ
- అదనంగా లక్ష టార్పాలిన్లతో అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడాం
- నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నాం.. 90 శాతానికిపైగా సద్వినియోగం అవుతోంది
- డిఫాల్ట్ మిల్లర్ల నుంచి రూ. 3,800 కోట్లు వసూలు.. మరో రూ. 1,400 కోట్లు రావాలి
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్



**సూర్య హైదరాబాద్**

వర్షాకాలం నేపథ్యంలో 3 నెలల రేషన్‌ను ఈ నెలలోనే పొందుతున్న రేషన్‌కార్డుదారులు మూడుసార్లు, ఆరుసార్లు వేలిముద్రలు వేసే అవసరం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను సరిచేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడించారు. కేంద్రం జారీ చేసిన ఎన్ఎఫ్ఎస్ కార్డులకు ఆరుసార్లు.. రాష్ట్రం ఇచ్చిన ఎస్ఎఫ్ఎస్ కార్డులకు మూడుసార్లు వేలిముద్రలు వేయాల్సి రావడంతో జరుగుతున్న జాప్యాన్ని గుర్తించి సరిచేసినట్లు తెలిపారు. - మిగతా2లో



## ఎంట్రీ లెవల్‌కూ ఏఐ సవాల్!

- తొట్టతొలి ఉద్యోగాలకు ఎసరు పెడుతున్న కృత్రిమ మేధ
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని కానిచ్చేస్తున్న కంపెనీలు
- ప్రపంచ వ్యాప్తంగాఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు తగ్గుతున్న డిమాండ్
- యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలి అంటున్న నిపుణులు
- సాంకేతికతకు సృజనాత్మకత జోడింపుతో అదనపు ప్రయోజనాలు చేకూరతాయని సూచన

## రూ.2,125 కోట్ల పెట్టుబడులు

- ముందుకొచ్చిన యూఏఈ కంపెనీలు శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్
- 5,020 మందికి ఉద్యోగావకాశాలు
- మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో 5 సంస్థలతో అవగాహన ఒప్పందం
- వచ్చే మూడేళ్లలో మరో రూ.24 వేల కోట్ల పెట్టుబడులకు సంసిద్ధత



**సూర్య హైదరాబాద్**

రాష్ట్రంలో రూ.2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్ సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఈ మేరకు సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో మంగళవారం రాష్ట్రానికి చెందిన 5 కంపెనీలతో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా 5,020 మంది తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎంఓయూ అనంతరం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. "రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. తెలంగాణ - మిగతా2లో

# సీఎం శాఖలు సీనియర్లకు!

-మొదటిపేజీ తరువాయి

నేపథ్యంలో వాటిని ఇతర సీనియర్ మంత్రులకు కేటాయించాలని పార్టీ పెద్దలు సూచించినట్లు తెలుస్తోంది. కొత్తగా మంత్రివర్గంలో చేరిన ముగ్గురు మంత్రులు కొత్తవారే అయినందున వారికి ఇతర మంత్రుల వద్ద ఉన్న శాఖలను కేటాయించి, సీనియర్ మంత్రులకు న్యాయ, హోంశాఖ, విద్యా శాఖలను ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో కొందరు మంత్రుల పనితీరు పరిగణనలోకి తీసుకుని శాఖల మార్పు చేయాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల సమాచారం. అయితే ఎవరి శాఖల మార్పు జరుగుతుందనేది బుధవారం ఉదయం వెల్లడయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఎవరూ పార్టీ వీడకుండా చూడండి**

మంత్రి పదవులు ఆశించినా దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్న నేతల అంశం సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. మంత్రి పదవులు లభించని సీనియర్ నేతలు సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రేంసాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులకు ఎలాంటి భరోసా కల్పించాలన్న దానిపై చర్చించారు. ప్రస్తుతానికి ఎమ్మెల్యేలు కానీ, వారి అనుచరులు కానీ ఎవరూ పార్టీని వీడకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. అవసరమైతే నేరుగా నేతలను తమతో మాట్లాడించాలని చెప్పినట్లు సమాచారం. అయితే సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవడంతో పాటు మరో మైనార్టీ నేతకు అవకాశం ఇస్తే సమన్యాయం జరిగినట్టవుతుందని ముఖ్యమంత్రి అన్నారని, దీనిపై మున్ముందు నిర్ణయం చేద్దామని హైకమాండ్ నేతలు చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సాయంత్రం పార్టీ పెద్దల నుంచి పిలుపు రావడంతో ఆయన హుటాహుటిన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. మరోవైపు మంగళవారం రోజంతా డిప్యూటీ సీఎం భట్టితో హైకమాండ్ ఫోన్‌లో



మంతనాలు జరిపింది. అయితే ఉత్తమ్ ఢిల్లీ వెళ్లిన కొద్దిసేపటికే భట్టికి కూడా అక్కడినుంచి పిలుపు వచ్చిందని, ఆయన కూడా విమానం ఎక్కుతున్నారనే ప్రచారం జరిగింది. కానీ భట్టి మంగళవారం రాత్రి వరకు ఢిల్లీ వెళ్లలేదు. హైదరాబాద్‌లోనే ఉన్న ఆయన సమీక్షల్లో పాల్గొంటూనే పార్టీ పెద్దలతో మంతనాలు జరిపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మంత్రులు, పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

**త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం**

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ల నియామకంతో పాటు 10%–%15 కార్పొరేషన్లకు కొత్త చైర్మన్ల నియామకం కూడా త్వరలోనే జరుగుతుందని, దీనిపై కూడా పార్టీ పెద్దలతో రేవంత్ చర్చించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

**రాష్ట్రంలో బహిరంగ సభలకు యోచన**

కులగణన, ఎస్సీల వర్గీకరణ, రాజ్యాంగ పరిరక్షణ సభలను తెలంగాణలో ఏర్పాటు చేయాలని రాహుల్‌గాంధీ భావిస్తున్నారని తెలిసింది. ఈ సభలను భారీ ఎత్తున నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఆలోచనలను దేశమంతా వివరించే యోచనలో రాహుల్ ఉన్నారని, వాటి నిర్వహణపై కూడా చర్చ జరిగిందని సమాచారం. మరోవైపు 11 ఏళ్ల బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా మరో బహిరంగ సభ నిర్వహణ యోచనలోనూ కాంగ్రెస్ హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సభలకు ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీ ఎవరో ఒకరు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు, తేదీలను త్వరలోనే ఖరారు చేయనున్నారని సమాచారం.

# రూ.2,125 కోట్ల పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వ సంకల్పం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. ఏడాదిన్నర కాలంలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చాం. ఫలితంగా ప్రైవేటు రంగంలో లక్ష మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించాయి. తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చిన యూఏఈకి చెందిన ప్రముఖ కంపెనీలు శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్‌ను ప్రభుత్వం తరపున సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ఇవి సంయుక్తంగా రాష్ట్రానికి చెందిన 'రివలేషన్స్ బయోటెక్'లో రూ.1,360 కోట్లు, 'మనాకిన్ బయో'లో రూ.340 కోట్లు, 'స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్'లో రూ.80 కోట్లు, 'ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్'లో రూ.90 కోట్లు, 'యంత్ర టెక్ కంట్రోల్స్'లో రూ.255 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి. వచ్చే మూడేళ్లలో బయోటెక్, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్‌టెక్, పబ్లిక్ సెక్టార్స్ తదితర రంగాల్లో మరో రూ.24 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్ సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ రెండు కంపెనీలు వచ్చే మూడేళ్లలో యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్‌మెంట్ తదితర ఉత్పత్తులకు సంబంధించి ఫోర్త్ సిటీ, ఏఐ సిటీల్లో పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రభుత్వంపై నమ్మకం ఉంచి.. 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన వీరికి ప్రత్యేక ధన్యవాదాలు.

**ప్రభుత్వంపై దుష్ప్రచారం..**



'రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదు.. పరిశ్రమలు వెళ్లిపోతున్నాయి' అంటూ మా ప్రభుత్వంపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటివారికి మేం తీసుకొస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉద్యోగాలు కనిపించడం లేదా? ఒక్కసారి తెలంగాణ ప్రజలు ఆలోచించాలి. ఇక్కడి యువత ప్రతిభే మాకున్న పెద్ద ఆస్తి. డిగ్రీ, ఇంజినీరింగ్ పట్టా తీసుకుని బయటికొచ్చే విద్యార్థుల్లో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉండటం లేదనే ఫిర్యాదు పారిశ్రామికవేత్తల నుంచి తరచూ వస్తోంది. ఈ అంతరాన్ని తగ్గించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటుచేశాం.

**తెలంగాణ.. ప్రతిభకు చిరునామా..**


తెలంగాణ అవకాశాల గని.. ప్రతిభకు చిరునామా. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు గమ్యస్థానం. ప్రజాప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుంది. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలి" అని శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలను కోరారు. ఈ కార్యక్రమంలో శైవ గ్రూప్ ఛైర్మన్, సీఈవో అమిత్ జగన్నాథ్‌వర్మ, టారనిస్ క్యాపిటల్ సీఈవో నికోలస్ ఎస్.బింగ్‌హామ్, రివలేషన్స్ బయోటెక్ ఎండీ రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజాం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ సీఈవో సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పాండు రంగారావు తమ్మినేని, యంత్ర టెక్ కంట్రోల్స్ సీఈవో సమీర్‌కాంత్, ఈ ఒప్పందానికి సమన్వయకర్త రాయ్ డిన్‌రోచ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగులకు ప్రమాద బీమా రూ.కోటి

హైదరాబాద్

విద్యుత్ ఉద్యోగులకు ప్రమాద బీమా కింద రూ. కోటి చెల్లించేలా ఎస్‌బీఐతో ఒప్పందం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమం అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన సమక్షంలో బ్యాంకర్లతో విద్యుత్ సంస్థలు ప్రమాద బీమా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 52 వేల మంది ఉద్యోగులకు ఈ ప్రమాద బీమా వర్తించనుంది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రమాద బీమా కింద ఉద్యోగులు పైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.80 లక్షుల పరిహారం అందుతుందని తెలిపారు. ఉద్యోగి సహజ మరుణం చెందితే రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని, ఉద్యోగితోపాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుందని వివరించారు.

త్వరితగతిన 'యాదాద్రి' పూర్తికి భట్టి ఆదేశం: యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. త్వరితగతిన ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు నిర్మాణ సంస్థ బీహెచ్‌ఈఎల్‌ను ఆదేశించారు. ప్రతి వారానికి ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులను సోమవారం పరిశీలించి వచ్చిన బీహెచ్‌ఈఎల్ సీఎండీ, డైరెక్టర్లు, టీజీ జెన్‌కో




సీఎండీ అక్కడ జురుగుతున్న పనుల పురోగతిని భట్టికి వివరించారు. యూనిుట్%–%1, యూనిట్%–%2 పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, మిగతా మూడు యూనిట్ల పనులు తుదిదశలో ఉన్నాయని చెప్పారు. అన్ని యూనిట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా ప్రారంభమవుతాయన్నారు. కాగా ఇటీవల మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ఇద్దరు కొత్త మంత్రులు ఆయన్ను సత్కరించారు.

## 3 నెలల రేషన్.. ఒకటే నిశాన్



-మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు వినియోగదారులు ఒకసారి వేలిముద్ర వేస్తే సరిపోతుందన్నారు. అయితే మూడు నెలల రేషన్ కాబట్టి బియ్యాన్ని రెండు, మూడుసార్లు తూకం వేయాల్సి వస్తుందని వివరించారు.

**మరో వారంలో ధాన్యం సేకరణ పూర్తి**

ముందస్తు నైరుతి రుతుపవనాలు, అకాల వర్షాలు ముంచెత్తినా, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేశాం. సోమవారం నాటికి ఏకంగా 72.83 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని సేకరించాం. చాలా జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం సేకరణ పూర్తయింది. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం సేకరిస్తాం. ఆలస్యంగా నాట్లేసిన మండలాల్లో ఒక్కో కేంద్రాన్ని అందుబాటులో ఉంచుతాం. రైతుల నుంచి ఇప్పటివరకు రూ. 16,760 కోట్ల విలువైన ధాన్యాన్ని కొని రూ. 15,121 కోట్లు చెల్లించాం.

**కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

యాసంగి కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేసిన 8,378 కేంద్రాల్లో మౌలికవసతుల కల్పనతోపాటు వర్షం పడినా రైతులకు ఇబ్బంది కలగకుండా ఇప్పటికే ఉన్న 2.5 లక్షల టార్పాలిన్లకు అదనంగా లక్ష టార్పాలిన్లను పంపించాం. దక్షిణాదిలోనే తొలిసారిగా 830 ప్యాడీ క్లీనర్లు, ధాన్యం ఆరబెట్టేందుకు డ్రైయర్లను కొనుగోలు చేసి రైతులకు అందుబాటులో ఉంచాం. తద్వారా పచ్చి ధాన్యాన్ని, రాళ్లురప్పలు ఉన్న ధాన్యాన్ని కూడా శుభ్రం చేసి కొని మిల్లులకు పంపాం.

**783 మంది డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం నిలిపివేశాం**

రాష్ట్రంలో 3 వేలకుపైగా ఉన్న మిల్లుల్లో 2022%–%23లో యాసంగి ధాన్యం సీఎంఆర్ చేయకుండా ఎగ్గొట్టిన మిల్లర్లతోపాటు కొన్నేళ్లుగా బకాయిపడ్డ మిల్లర్లకు యాసంగిలో ధాన్యం కేటాయించలేదు. రాష్ట్రవ్యాప్తంగా 783 మంది మిల్లర్లను బ్లాక్ చేశాం. 2022%–%23 యాసంగి ధాన్యం సీఎంఆర్ ఇవ్వని మిల్లర్ల నుంచి రూ. 3,800 కోట్ల విలువైన ధాన్యం, బియ్యం లేదా అందుకు సమానమైన విలువను రికవరీ చేశాం. ఇంకా రూ. 1,400 కోట్లు మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. మరో 1.5 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సరిపడా బియ్యాన్ని మిల్లర్ల నుంచి సేకరించి ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్నాం. మిస్సింగ్ కింద చూపించిన (మిల్లర్లు అమ్ముకున్న) 5.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సమానమైన రూ. 1,000 కోట్లను సంబంధిత మిల్లర్ల నుంచి రికవరీ చేయాల్సి ఉంది. ఇప్పటికే నోటీసుల జారీ ప్రక్రియ మొదలైంది.

**సన్నబియ్యం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట**

గతంలో రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే దొడ్డు బియ్యాన్ని దళారులు తక్కువ ధరకు కొని విక్రయించేవారు. ఉగాది కానుకగా అమల్లోకి తెచ్చిన రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీతో అక్రమాలకు అడ్డుకట్టపడినట్లయింది. నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలు కూడా సన్నబియ్యం కోసం క్యూలలో నిలబడి మరీ తీసుకెళ్తున్నారు. ఫలితంగా బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడింది. గతంలో దొడ్డుబియ్యాన్ని 20 శాతం మంది ప్రజలే వినియోగిస్తే సన్నబియ్యం 90 శాతానికిపైగా సద్వినియోగం అవుతోంది. తెలంగాణలో పండిన దొడ్డు బియ్యాన్ని నేరుగా ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్నాం. ఇతర దేశాలతో కూడా చర్చలు జరుగుతున్నాయి.


## రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు పెంచాలి

హైదరాబాద్

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచడంతోపాటు, సంబంధిత ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా ఆయిల్‌ఫెడ్‌ను ఆర్థికంగా బలోపేతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. "5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ఆయిల్‌ఫెడ్ పనిచేయాలి. నర్సరీ స్థాయిలోనే మొక్కలపై అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. వ్యవసాయశాఖ సహకారంతో రైతులకు అంతర పంటలపై అవగాహన కల్పించాలి. సిద్దిపేట జిల్లాలోని నర్మెట్టలో ఆయిల్‌పామ్ పరిశ్రమ భవన నిర్మాణం జులైనాటికి పూర్తిచేయాలి. ఆయిల్‌ఫెడ్‌లోని అన్ని విభాగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గల ఉద్యోగులను నియమించేందుకు ప్రణాళిక రూపొందించాలి" అని మంత్రి సూచించారు. సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దిల్లీలో తాకట్టు

దిల్లీ



ఎన్నికల సమయంలో అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. వాటి అమలును గాలికొదిలేయడంతో అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని భాజపా రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం దిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. "18 నెలల పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 46 సార్లు దిల్లీకొచ్చారు. ప్రతి చిన్న పనికీ అధిష్ఠానంపై ఆధారపడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దిల్లీలో తాకట్టు పెడుతున్నారు. తెలంగాణ ప్రజలు ఏదైనా సహిస్తారు కానీ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడితే సహించరు. కొత్త మంత్రులకు శాఖలు కూడా కేటాయించుకోలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... ప్రభుత్వ బండిని ముందుకు తీసుకెళ్లలేకపోతోంది. దీనివల్ల రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం లేదు. పింఛన్లు పెంచడం లేదు. డీఏలు, పీఆర్సీలు ఇవ్వడం లేదు. రైతులకు భరోసా ఇవ్వలేదు" అని లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా 11 ఏళ్ల మోదీ పాలనపై ఆయన ప్రశంసలు కురిపించారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీ... ప్రతి రంగంలో దేశాన్ని నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు.

# పిల్లలా... వద్దులే!

ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు, ఇకపై వద్దంటూ ఒకప్పుడు ప్రభుత్వాలే ముమ్మరంగా ప్రచారం చేశాయి. జనాభా అడ్డూఅదుపూ లేకుండా పెరిగిన రోజులవి. జనాభా వృద్ధి నానాటికీ నేలచూపులు చూస్తుండటం నేటికాలపు చేదు నిజం. భారత్ అనే కాదు, జనాభా వృద్ధిలో ప్రపంచమంతటా కనీవినీ ఎరగని రీతిలో భారీ తగ్గుదల నమోదవుతోంది! దాంతో వీలైనంత మందిని కనండని ప్రభుత్వాలే వేడుకుంటున్నాయి. కానీ ఫలితం మాత్రం పెద్దగా కన్పించడం లేదు. నానాటికీ చుక్కలనంటున్న జీవనవ్యయమే దీనికి ప్రధాన కారణమని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) సర్వే తేల్చింది.

పునరు త్పాదనకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా దంపతుల మనోగతం తెలుసుకునేందుకు ఈ ఐరాస సంస్థ ప్రయత్నం చేసింది. ఇందుకోసం 14 దేశాల్లో 14 వేల జంటలపై అధ్యయనం జరిపింది. "అత్యధికులకు ఎక్కువమందిని కనాలని ఉన్నా ఆకాశాన్నంటున్న ఖర్చులకు భయపడుతున్నారు. పోషణ భారమవుతుందనే భయంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఒక్క సంతానానికే పరిమితమవుతున్నారు" అని తేల్చింది. తమ శాంపిల్ సంఖ్య చూసేందుకు చిన్నదిగా కనిపిస్తున్నా సర్వే ఫలితాలు మాత్రం కోట్లాది మంది మనోగతానికి అద్దం పడుతున్నాయని స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరికల్లా మరో 50 దేశాల్లో సర్వే జరపాలని యూఎన్ఎఫ్‌పీఏ నిర్ణయించింది.

**ఇలా చేశారు**

సర్వేలో సమాజంలోని అన్ని వర్గాల అభి ప్రాయాలూ సముచితంగా ప్రతిఫలించేలా యూఎన్ఎఫ్‌పీఏ జాగ్రత్తలు తీసుకుంది.

భారత్, అమెరికా, బ్రెజిల్, మెక్సికో, ఇటలీ, హంగరీ, జర్మనీ, స్వీడన్, దక్షిణకొరియా, మొరాకో, నైజీరియా, దక్షిణాఫ్రికా, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాలను ఎంచుకుంది. తద్వారా అన్ని ఖండాలకూ సరైన ప్రాతినిధ్యం ఉండేలా చూసింది. ప్రపంచ జనాభాలో మూడో వంతు ఈ దేశాల్లోనే ఉండటం విశేషం! పేద, వర్ధమాన, సంపన్న దేశాలను ఎంచుకుంది. జననాల రేటు అత్యల్పంగా, అత్యధికంగా ఉన్న దేశాలు తగినంతగా కవరయ్యేలా జాగ్రత్త పడింది. అల్పాదాయ, మధ్యతరగతి, సంపన్న జంటలుబీ యువ, మధ్యవయసు, 50 ఏళ్ల పైచిలుకు వారిని తగిన నిష్పత్తిలో ఎంపిక చేసుకున్నారు.

**ఇదీ తేలింది**

సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురిలో ఒకరు ఎక్కువ మందిని కనాలని ఉన్నా అందుకు సాహసం చేయలేకపోయినట్టు అంగీకరించారు.

సంతాన లేమికి వంధ్యత్వాన్ని కారణంగా పేర్కొన్నది 12 శాతం మంది మాత్రమే!

ఆర్థిక స్తోమత లేకపోవడం వల్లే పిల్లల్ని కనలేదని, లేదా రెండో సంతానానికి వెళ్లలే దని 39% మంది వాపోయారు. ఇలాంటివా రి సంఖ్య దక్షిణ కొరియాలో అత్యధికంగా (58 %), స్వీడన్‌లో అత్యల్పంగా (19%) ఉంది.

ఎక్కువ మందిని కనాలని ఉన్నా అందుకు సాహసం చేయలేకపోయినట్టు 50 ఏళ్ల పై చిలుకు వారిలో సగం మందికి పైగా  అంగీకరించారు.

థాయ్‌లాండ్‌లో 19 శాతం మంది వంధ్యత్వాన్ని ప్రధాన కారణంగా చూపారు. తర్వాతి స్థానాల్లో అమెరికా (16 శాతం), దక్షిణాఫ్రికా (15 శాతం), నైజీరియా (14 శాతం), భారత్ (13 శాతం) ఉన్నాయి.

ఆఫీసుకు వెళ్లి రావడానికే రోజుకు సగటున మూడు గంటలు పోతోందంటూ చాలా జంటలు ఆవేదన వెలిబుచ్చాయి. దాంతో పిల్లల బాగోగులు చూసుకునేంత సమయం లేదని వాపోయాయి.

40 ఏళ్ల కింద చాలా దేశాలు అధిక జనాభాతో సతమతమయ్యాయి. కానీ 2015 నుంచి జనాభా తగ్గుదలే పెను సమస్యగా మారుతూ వస్తోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సంక్షోభమిది. దీనికి తోడు చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య శరవేగంగా పెరుగుతుండటంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి జారుతోంది

**భారత్‌లో కూడా..!**

భారత్‌లో జనాభా 146.4 కోట్లకు చేరినట్టు యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక వెల్లడించింది. అయితే అన్ని దేశాల్లో మాదిరిగానే మన దేశంలోనూ జనాభా వృద్ధి నానాటికీ తగ్గిపోతోందని పేర్కొంది. జనాభా పెరుగుదల స్థిరంగా ఉండాలంటే సంతానోత్పత్తి రేటు సగటున ఒక్కో మహిళకు కనీసం 2.1 ఉండాలి. కానీ భారత్‌లో అది 1.9కి తగ్గినట్టు నివేదిక తెలిపింది.

**నివేదిక విశేషాలు...**

ప్రపంచ దేశాలన్నింట్లోనూ అత్యధిక యువతతో భారత్ కళకళలాడుతోంది. జనాభాలో 24 శాతం 0%–%14 ఏళ్ల వయసు వారున్నారు. 10%–%19 ఏళ్లు 17 శాతం కాగా  24 శాతం మంది 10%–%24 ఏళ్ల వయసువారు.

జనాభాలో ఏకంగా 68 శాతం పనిచేసే వయసులో (15%–%64) ఉన్నారు.

65 ఏళ్లు, ఆపైబడ్డ వృద్ధులు 7 శాతం.

మహిళల్లో సగటు ఆయుప్రమాణం 74 ఏళ్లు కాగా పురుషుల్లో 71 ఏళ్లు.

భారత్‌లో జనాభా మరో 40 ఏళ్ల పాటు పెరిగి 170 కోట్లకు చేరుకుంటుంది. అక్కడినుంచి తగ్గుముఖం పడుతుంది.

# కుటుంబ వ్యాపారానికి యువతరం నో

తరాలుగా సంక్రమించిన కుటుంబ వ్యాపారాన్ని సహజంగా వారసులు కొనసాగిస్తుంటారు. వారసులు నడుపుతున్న వాటిలో మనకు తెలిసిన దుకాణాలే చాలా ఉంటాయి. అంతెందుకు మన పొరుగునే ఉంటారు. కుటుంబ వ్యాపార విధానం ఒక్క భారత్‌కే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది.  వారసత్వాన్ని కొనసాగించడం ఒక బాధ్యతగా భావించిన రోజులు గతం. యువ'తరం' మారింది. ఆలోచనల్లో అంతరం కనిపిస్తోంది. పాత తరం వ్యాపారం భారంగా భావించడమో.. తమ కొత్త ఆలోచనలకు పదును పెట్టాలనుకోవడమో.. కారణం ఏదైనా భారత్‌లో కేవలం 7% మంది వారసులు మాత్రమే తమ కుటుంబ వ్యాపారాన్ని అందిపుచ్చుకోవాలని భావిస్తున్నారట. హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ ఇటీవల నిర్వహించిన సర్వే ఆసక్తి రేకెత్తిస్తోంది. మనదేశంలో వారసత్వం చుట్టూ ఉన్న సంప్రదాయ అంచనాలను.. ఈ నివేదికలోని అంశాలు తలకిందులు చేస్తున్నాయి. 79% వ్యాపార యజమానులు ఇప్పటికీ తమ వ్యాపారాన్ని కుటుంబ సభ్యునికి బదిలీ చేయాలని ఆసక్తి చూపుతున్నప్పటికీ.. కుటుంబ వ్యాపారాన్ని వారసత్వంగా స్వీకరించేందుకు అతి తక్కువగా 7% మంది వారసులు మాత్రమే సిద్ధంగా ఉన్నామని చెప్పారట.  88% మంది భారతీయ వ్యవస్థాపకులు తమ కుటుంబ సంపదను నిర్వహించడంలో తదుపరి తరం సామర్థ్యంపై నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. కొసమెరుపు ఏమంటే తమ పిల్లలు కుటుంబ వ్యాపారాన్ని అందిపుచ్చుకుంటారని ఆశించడం లేదని 45% మంది నిర్మొహమాటంగా తేల్చి చెప్పారు.

**సర్వేలో 1,798 మంది..**

హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ ప్రైవేట్ బ్యాంకింగ్ 'ఆసియాలో కుటుంబ వ్యాపారాలు:  సామరస్యంగా వారసత్వ బదిలీ 2025' పేరుతో నివేదిక రూపొందించింది. కనీసం రూ.17 కోట్లు పెట్టుబడి పెట్టగలిగే అధిక నికర విలువ (హెచ్ఎన్ఐ) కలిగిన 1,798 మంది వ్యాపారవేత్తలు ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. ఈ పరిశోధనను చైనా, ఫ్రాన్స్, హాంకాంగ్, భారత్, సింగపూర్, స్విట్జర్లాండ్, తైవాన్, యూఏఈ, యూకే, యూఎస్‌లో ఆన్ లైన్ లో నిర్వహించారు.

**వందేళ్లకుపైగా విజయవంతంగా..**

దేశంలో కుటుంబ యాజమాన్యంలోని వ్యాపారాలు సంపద బదిలీ, వారసత్వ ప్రణాళికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. పటిష్టమైన ఆర్థిక సలహాలు, నష్ట నివారణ చర్యలు, సంపద నిర్వహణకు తదుపరి తరానికి పాతతరం.. వారి అనుభవాన్ని రంగరించి సలహాలూ సూచనలూ ఇస్తోంది. తమ కుటుంబ వ్యాపారం భవిష్యత్తులో మరింత విస్తరించాలనే దూరదృష్టితో.. కుటుంబ పెద్దలు అత్యంత పారదర్శకంగా బదిలీ ప్రక్రియను చేపట్టడంతోపాటు యువతరానికి మార్గదర్శకత్వమూ వహిస్తున్నారు. కొన్ని కుటుంబ వ్యాపారాలు 100 ఏళ్లకుపైగా విజయవంతంగా కొనసాగుతున్నాయంటే ఇలాంటి చర్యలే కారణం.

**మన దగ్గరే అత్యధికం..**

ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థల వ్యవస్థాపకులకు వేర్వేరు వారసత్వ ప్రణాళికలు ఉన్నాయి. కొందరు తమ వ్యాపారాలను విక్రయించడానికి ఇష్టపడుతున్నారు. చాలా మంది మాత్రం తాము నిర్వహిస్తున్న వ్యాపారాన్ని కుటుంబ సభ్యునికి బదిలీ చేయాలని అనుకుంటున్నారు. ఇలాంటి వారి సంఖ్య అత్యధికంగా భారత్‌లో 79% ఉంటే.. యూకేలో 77%, స్విట్జర్లాండ్ 76%, తైవాన్ 61, చైనా 56, హాంగ్‌కాంగ్‌లో 44% ఉంది. ఇక మహా నగరాల్లో పెరిగి, విదేశాల్లో చదువుకున్న రెండో, మూడో తరం వ్యవస్థాపకులు వారి వారసత్వ వ్యాపారాలను నూతనంగా మలుచుకుంటున్నారు. మా మీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని, కాబట్టే వ్యాపారాన్ని మరింత బాధ్యతగా తీసుకున్నామని దాదాపు 95% మంది చెప్పారు. ఇలా చెప్పిన వాళ్లు మనదేశంలోనే ఎక్కువ. ఈ విషయంలో ప్రపంచ సగటు 81%. కుటుంబ వ్యాపారాన్ని చేపట్టినప్పటికీ.. కొత్త ఆలోచనలతో ఇతర వ్యాపారాల్లోకి కూడా అడుగుపెట్టగలం అనే ధీమాను 83% మంది తదుపరితరం భారతీయులు వ్యక్తం చేశారు.

**జీడీపీలో 79% వాటా..**

భారత జీడీపీలో కుటుంబ వ్యాపారాల వాటా దాదాపు 79% ఉంది. 1990ల నాటి ఆర్థిక సరళీకరణ తర్వాత చాలా వరకు ఈ కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఇప్పుడీ సంస్థల్లో తరాల మార్పు జరుగుతోంది. 2023%–%2030 మధ్య ఆసియా పసిఫిక్ ప్రాంతంలో రూ.4,95,90,000 కోట్ల సంపద ఒక తరం నుంచి తదుపరి తరానికి బదిలీ జరుగుతుందని మెకిన్సే అంచనా వేసింది. వీరిలో అల్ట్రా%–%హై నెట్‌వర్త్ వ్యక్తులు 60% మంది ఉన్నారు.

# సింగిల్ డిజిట్‌కు భారత్ పేదరికం

న్యూఢిల్లీ  : భారత్, పాకిస్థాన్ మధ్య పేదరిక స్థాయిలలో గణనీయమైన వ్యత్యాసం ఉందని తాజాగా ప్రపంచ బ్యాంకు గ్లోబల్ పావర్టీ డేటా స్పష్టం చేసింది. వరల్డ్ బ్యాంకు డేటా రెండు దేశాల ఆర్థిక ప్రగతి, పాలన వ్యవస్థల ప్రభావం,సామాజిక సంక్షేమ విధానాల ఫలితాలను ప్రతిబింబిస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. భారతదేశంలో తీవ్రమైన పేదరిక రేటు2011లో 22.5%గా ఉండగా.. అది 2021 నాటికి 10%కి తగ్గింది.అంతేకాదు, 2024 నాటికి ఈ రేటు సింగిల్ డిజిట్‌కు తగ్గిపోవచ్చని అంచనాలు ఉన్నాయి. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ఆహార రాయితీలు వంటి సంక్షేమ పథకాలు ఈ పురోగతికి దోహదం చేశాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, డిజిటల్ లావాదేవీల విస్తరణ కూడా పేదరికం తగ్గుదలకు దోహదం చేశాయని తెలిపింది. జనాభాలో ఎంత శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువ నివసిస్తున్నారో నిర్ధారించడానికి ద్రవ్యోల్బణాన్ని దాని ప్రాథమిక సూచికలలో ఒకటిగా వరల్డ్ బ్యాంకుపరిగణనలోకి తీసుకుంది. తన ప్రపంచ ఆదాయ పరిమితిని ఓ వ్యక్తికి రోజుకు 2.15డాలర్ల నుంచి 3 డాలర్లకు సవరించింది. ప్రపంచ బ్యాంకు పేదరికం, భాగస్వామ్య శ్రేయస్సు నివేదిక ప్రకారం.. 2012– 2022 మధ్య, ప్రతి వ్యక్తి ఆదాయంలో



పెరుగుదల సవరణ ఉన్నప్పటికీ, భారతదేశంలో తీవ్ర పేదరికం మొత్తం జనాభాలో 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గింది.భారత్‌లో 2022–23 నాటికి 75.24 మిలియన్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారని, ఇది 2011–12లో 344.47 మిలియన్లతో పోల్చితే భారీ తగ్గుదల అని నివేదిక పేర్కొంది. కేవలం 11 ఏళ్లలో పాకిస్థాన్ మొత్తం జనాభా కంటే ఎక్కువ మంది భారతదేశంలో తీవ్ర పేదరికం నుంచి బయటపడటం విశేషం.విచారకరంగా పాకిస్థాన్ విషయానికొస్తే కథ దీనికి విరుద్ధంగా ఉంది. 2017– 2021 మధ్య 5 ఏళ్లలో తీవ్ర పేదరికం 4.9 శాతం నుంచి 16.5 శాతానికి పెరిగింది. పాక్ గృహ ఆదాయం, వ్యయ సర్వే కారణంగా పరిస్థితి చాలా దారుణంగా ఉండొచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు.పాకిస్థాన్‌లో ఆర్థిక సంక్షోభం, పేదరికం మరింత తీవ్రమవుతుండటం గమనార్హం. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. పాకిస్థాన్‌లో పేదరిక రేటు 2018లో 34.2%గా ఉండగా.. 2023 నాటికి అది 39.4%కి పెరిగింది. గత ఐదేళ్లుగా పాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ద్రవ్యోల్బణం, ఐఎంఎఫ్ రుణాలపై ఆధారపడటం, ఆ దేశ కరెన్సీ విలువ పతనం, పాలనా అస్థిరత ప్రధాన కారణాలు. ముఖ్యంగా నిత్యావసర, ఇంధన ధరల పెరుగుదల, ఉద్యోగ అవకాశాల కొరత దాయాది దేశంలో పేదరికాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. ఆయుధ సామాగ్రి వ్యయాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు నిధుల వినియోగం, సామాజిక పథకాలకు తక్కువ కేటాయింపులు ఇవన్నీ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయని నివేదిక తెలిపింది.వాస్తవంగా చూస్తే, వేగంగా పేదరికాన్ని తగ్గిస్తోన్న అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలుస్తోంది. మరోవైపు, పాకిస్థాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కోల్పోయి, అంతర్గత రాజకీయ అస్థిరత వల్ల సామాజిక రంగాల్లో వెనుకడుగు వేస్తోంది.ప్రస్తుతం పాక్ పేదరికం నుంచి బయటపడాలంటే రాజకీయ స్థిరత్వం,ప్రజాపాలనలో పారదర్శకత, వ్యవస్థాపిత సంక్షేమ విధానాలు, విద్య, ఆరోగ్య రంగాల్లో మరింత పెట్టుబడి అవసరమని ప్రపంచ బ్యాంకు నివేదిక స్పష్టం చేసింది.

## ఎంట్రీ లెవల్‌కూ ఏఐ సవాల్!

హైదరాబాద్



ప్రస్తుత పోటీ ప్రపంచంలో మొత్తంగా ఎంట్రీ లెవెల్ (తొలి స్థాయి)ఉద్యోగార్థులు, గ్రాడ్యుయేట్లకు డిమాండ్ భారీ ఎత్తున తగ్గిపోతోంది. రాను రాను మొదటి ఉద్యోగం దొరకడం అనేది కష్టంగా, సవాళ్లతో కూడుకున్నదిగా మారుతోంది. ఇప్పటికే వివిధ రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), తాజా గ్రాడ్యుయేట్లు తమ తొట్టతొలి కొలువు దక్కించుకోవడాన్ని కూడా కష్టసాధ్యం చేస్తోంది.  ప్రపంచ వ్యాప్తంగా వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు, కంపెనీలకు అవసరమైన డాక్యుమెంట్ల విశ్లేషణ, సమావేశాలకు అవసరమైన బ్రీఫింగ్ నోట్స్ తయారీ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీపీ) రూపకల్పన, కస్టమర్ల నుంచి వచ్చే ఫిర్యాదులు లేదా ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం వంటి పనులను ఏఐ సులువుగా చక్కబెట్టేస్తుండటమే ఇందుకు కారణం.

**ఏఐతో నెట్టుకొచ్చేస్తున్న కంపెనీలు..**

కొత్తగా ఉద్యోగాల్లో చేరే యువత తమ కెరీర్ మొదట్లో ఎక్కువగా ఈ తరహా పనులే చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఏఐ ప్రపంచాన్ని శాసిస్తోంది. అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోతోంది. ఉద్యోగాలకు ఎసరు తెస్తోంది. కంపెనీలు కూడా ఖర్చును దృష్టిలో పెట్టుకుని కృత్రిమ మేధ వైపు మొగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు సైతం తగ్గిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్'ఉన్నతోద్యోగి ఒకరు.. 'రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ అనేది అన్ని వైట్ కాలర్ జాబ్ (కార్యాలయాల్లో కూర్చుని పనిచేసే ఉద్యోగం)ల్లో సగానికి సగం ఎంట్రీ లెవల్ జాబ్‌లను తుడిచి పెట్టేస్తుంది..'అంటూ ఇటీవల చేసిన ప్రకటనను వారు ప్రస్తావిస్తున్నారు. ఈ పరిస్థితికి తగ్గట్టుగానే కొన్ని కంపెనీలు 'చాట్ జీపీటీ'ని ఇంటర్న్‌షిప్ చేసే జూనియర్ లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగిగా ఉపయోగించుకోవడాన్ని ఆచరణలో పెట్టేయడం గమనార్హం.  కాగా వివిధ రంగాలకు సంబంధించిన ఎంట్రీ లెవల్ జాబ్‌లకు డిమాండ్ తగ్గుదలను తాము గమనించామని లండన్‌లోని రిక్రూట్‌మెంట్ సంస్థ 'ఫ్రెష్ మైండ్స్'ప్రతినిధులు ఇటీవల వెల్లడించడాన్ని కూడా నిపుణులు గుర్తు చేస్తున్నారు. తమ సంస్థల్లో చేరబోయే ఉద్యోగులు 'వర్క్ రెడీ ప్రొఫెషనల్స్'గా ఉండాలని ఆయా సంస్థలు కోరుకుంటున్నాయని వారు తెలిపారు. కొన్ని కంపెనీలు జూనియర్ పోస్టులను సైతం సీనియర్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్న ఉదంతాలను వెంచర్ క్యాపిటల్ సంస్థ సిగ్నల్ ఫైర్ తన 'స్టేట్ ఆఫ్ టాలెంట్ 2025'నివేదికలో ప్రస్తావించింది.

**సంసిద్ధులుకావాల్సిందే..: నిపుణులు**

ప్రస్తుత పరిస్థితులన్నీ ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు మొదటి ఉద్యోగం సాధించడాన్ని సమస్యాత్మకంగా మారుస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. నవ యువత సాంకేతికంగా ఒక అడుగు ముందుకేసి తమకు సవాళ్లు విసురుతున్న వ్యవస్థలను అధిగమించేందుకు సంసిద్ధులై ఉండాలని సూచిస్తున్నారు. కృత్రిమ మేధనే ఓ ఆయుధంగా మలుచుకోవాలని చెబుతున్నారు. చాట్ జీపీటీ, గ్రోక్, తదితరాలను ఉపయోగిస్తూ తమపై పడే పనిభారాన్ని తగ్గించుకోవడంతో పాటు విధుల నిర్వహణలో వేగంగా ముందుకు సాగాలని స్పష్టం చేస్తున్నారు.

**సిద్ధమే అంటున్న యువత..**

తాజాగా యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్ ఒకరు.. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన 70 మంది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ విద్యార్థులను ఏఐతో, ఎంట్రీ లెవల్ జాబ్స్ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను గురించి ప్రశ్నించారు. ఏఐ వల్ల వారికి రావాల్సిన ఉద్యోగాల్లో భారీగా కోతగా ఏర్పడబోతోందా? ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటారు? అని అడిగారు. పలువురు విద్యార్థులు స్పందిస్తూ.. ఏఐ వల్ల తమకు నష్టం జరుగుతుందని భావించడం లేదని చెప్పారు.  తాము ఏఐనే ఓ సాధనంగా ఉపయోగించుకుని పని ప్రదేశాల్లో రాణించేందుకు సిద్ధమంటూ సమాధానమిచ్చారు. ఏఐ టూల్స్ వినియోగంలో తాము పైచేయి సాధించినందున తమకు పెద్దగా సమస్య ఎదురుకాబోదని అన్నారు. తమలో అత్యధికులు ఒక్క చాట్ జీపీటీనే కాకుండా... జెమిని, క్లాడ్, ఫైర్‌ఫ్లై, హేజెన్, గామా, హిగ్స్‌ఫీల్డ్, యుడియో, నోట్‌బుక్ ఎల్ఎం, మిడ్ జర్నీ వంటి వివిధ రకాల టూల్స్‌ను ఉపయోగిస్తున్నామంటూ ప్రశ్న అడిగిన ప్రొఫెసరే ఆశ్చర్యపోయేలా సమాధానమివ్వడం..ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా యువతలో వస్తున్న మార్పునకు సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**యువతను ప్రోత్సహిస్తే కంపెనీలకే మేలు**

కంపెనీలు కూడా ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ఎంట్రీ లెవల్ జాబ్‌లను ఏఐకు అప్పగించకుండా యువతకున్న టాలెంట్‌ను ఉపయోగించుకోవడం వల్ల అదనపు ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. చేసే పనికి సృజనాత్మకతను జోడించి కొత్త ఆవిష్కరణలు చేసేలా యువతను ప్రోత్సహించడం వల్ల కంపెనీలకే మేలు జరుగుతుందని చెబుతున్నారు.  కేవలం ఏఐ టూల్స్ వినియోగానికి పరిమితమవుతూ ఎక్కువ ఉత్పాదకత సాధనపై దృష్టి పెట్టకుండా వ్యూహాత్మకంగా, క్రియాశీలంగా పని చేసే వర్క్‌ఫోర్స్‌ను పెంపొందించుకుంటే అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు.

## భారత్ స్వరాన్ని సగర్వంగా చాటారు

న్యూఢిల్లీ

పాకిస్థాన్ ప్రమేయమున్న ఉగ్రవాదంపై భారత్ వైఖరిని వివరించేందుకు ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రపంచ రాజధానుల్లో పర్యటించి వచ్చిన అఖిలపక్ష ప్రతినిధుల బృందాల సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారంనాడు సమావేశమయ్యారు. తమ పర్యటనల వివరాలను ఎంపీలతా ప్రధానితో పంచుకున్నారు. 50 మందికి పైగా ప్రతినిధులతో ఏడు బృందాలు ప్రపంచదేశాల్లో పాక్ వైఖరిని ఎండగడుతూ, ఉగ్రవాదంపై పోరులో భారత వాణిని బలంగా వినిపించడంపై కేంద్ర ఇప్పటికే అభినందనలు తెలియజేసింది. 33 దేశాల రాజధానులు, యూరోపియన్ యూనియన్‌లో పర్యటించిన ప్రతినిధుల బృందాల్లో మాజీ పార్లమెంటేరియన్లు, మాజీ దౌత్యవేత్తలు కూడా ఉన్నారు.

విదేశీ పర్యటనలు ముగించుకుని వచ్చిన ప్రతినిధుల బృందం ఇప్పటికే కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను కలుసుకుంది. పాకిస్థాన్ స్పాన్సర్డ్ టెర్రరిజంపై భారత వైఖరిని బలంగా వినిపించిన సభ్యుల కృషి జైశంకర్ అభినందించారు. నాలుగు ప్రతినిధుల బృందాలకు ఎన్డీయే ఎంపీలు సారథ్యం వహించగా, వీరిలో బీజేపీకి చెందిన 2, జేడీయూ, శివసేనకు చెందిన చెరో ప్రతినిధి బృందం ఉంది. తక్కిన మూడు ప్రతినిధి బృందాలకు విపక్ష ఎంపీలు సారథ్యం వహిచారు. కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీ (ఎస్పీ)లు ఒక్కో ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించాయి.

బీజేపీ నేతలు రవిశంకర్ ప్రసాద్, బైజంయత్ పాండ, కాంగ్రెస్ నేత శశిథరూర్, జేడీయూ నేత సంజయ్ ఝా, శివసేన నేత శ్రీకాంత్ షిండే, డీఎంకే నేత కనిమొళి, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సులే సారథ్యంలో ఈ ప్రతినిధుల బృందాలు విదేశాల్లో పర్యటించాయి. టెర్రరిజంపై పోరులో అంతా ఏకతాటిపై ఉన్నామనే జాతీయ ఐక్యతా సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకు కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ వంటి నేతలు అధికార కూటమి సభ్యులతో కలిసి ప్రపంచ దేశాల్లో తమ వాణిని బలంగా వినిపించారు. మాజీ పార్లమెంటేరియన్లలో కేంద్ర మాజీ మంత్రులు గులాం నబీ ఆజాద్, సల్మాన్ ఖుర్షీద్ వంటి వారు సైతం ఉగ్రవాదంపై పోరులో భారతదేశ ఐక్యతా సందేశాన్ని చాటారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగుతున్న అభూత కల్పనలు



ఆర్థికవేత్తలు పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి అభూత కల్పనలు చాలానే అల్లారు. అటువంటి కల్పనల్లో డేవిడ్ రికార్డో అల్లినది రెండు శతాబ్దాలకు పైనే కొనసాగింది. యంత్రాలను ప్రవేశ పెట్టడాన్ని మొదట్లో చాలా ఉత్సాహంగా ఆహ్వానించినవాడు రికార్డో. అతని కాలంలో కార్మిక సంఘాలు.. యంత్రాల ప్రవేశం వల్ల నిరుద్యోగం పెరుగుతుందని చేసిన వాదనలన్నింటినీ అతడు తోసిపుచ్చాడు. "ఆర్థిక సూత్రాలు" అన్న అతడి గ్రంథం మూడవ ప్రచురణలో మాత్రం ఒక అధ్యాయాన్ని ప్రత్యేకంగా యంత్రాల గురించి అదనంగా చేర్చాడు. అందులో యంత్రాల ప్రవేశం వల్ల నిరుద్యోగం పెరుగుతుందని రికార్డో అంగీకరించాడు. ఐతే, అది తాత్కాలికమేనని, యంత్రాల వల్ల లాభాల రేటు పెరుగుతుంది కనుక సంపద పోగు పడడానికి, వృద్ధి వేగవంతం కావడానికి అది తోడ్పడుతుందని, దీర్ఘకాలంలో దాని వలన మరిన్ని ఎక్కువ ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని వాదించాడు. రికార్డో వాదనను కార్ల్‌మార్క్స్ తన "అదనపు విలువ సిద్ధాంతం" లో చాలా నిశితంగా విమర్శించాడు. రికార్డో వాదన పలు కారణాల రీత్యా తప్పు అని స్పష్టం చేశాడు. మొదటిది: రికార్డో యంత్రాలను ప్రవేశ పెట్టడం అనేది ఏదో ఒకసారి మాత్రమే జరిగే ప్రక్రియగా పరిగణించాడు. కాని పెట్టుబడిదారీ సమాజంలో సాంకేతిక మార్పులు అనేవి నిరంతరం జరిగే ప్రక్రియ. ఒక స్థాయి యంత్రాలకు బదులు మరొక స్థాయి యంత్రాలను తరచూ ప్రవేశ పెడుతూనే వుంటారు. అటువంటి సాంకేతిక పురోగతి ఫలితంగా లాభాల రేటు, సంపద పోగుబడడం అనేది పెరుగుతూనే వుంటుంది. అందుచేత అటువంటి యాంత్రీకరణ ఫలితంగా అందరికీ ఉపాధి కల్పించే పరిస్థితి అంతకంతకూ దూరమైపోతూ వుంటుంది. రెండవది: సే సూత్రం చెల్లుబాటు అవుతుందని రికార్డో భావించి దాని ప్రాతిపదికన తన వాదనను రూపొందించాడు. ఆ సూత్రం ప్రకారం "స్థూల డిమాండ్‌కు ఏనాడూ కొరత ఉండదు. పెట్టుబడిదారుల వద్ద పోగుబడిన సంపదనంతటినీ మళ్ళీ పెట్టుబడుల రూపంలో పెడతారు గనుక పోగుబడే సంపద పెరిగిన మేరకు పెట్టుబడులూ పెరుగుతూపోతాయి, దాని వలన అదనపు ఉపాధి అవకాశాలూ పెరుగుతూ పోతాయి. మార్కెట్ పెరుగుదలను అనుసరించి పెట్టుబడులు ఉండవు. ఎందుకంటే సంపదను డబ్బు రూపంలో దాచుకునేందుకు ఎవరూ సిద్ధంగా ఉండరు. అందువలన ఆ సంపద యావత్తూ పెట్టుబడులుగా మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది. దాని వలన ఉపాధీ పెరుగుతుంది. డిమాండ్ కూడా పెరుగుతుంది." ఐతే ఈ వాదన అవాస్తవికమేగాక, తార్కికంగా కూడా చెల్లదు.

పెట్టుబడి ఎప్పుడూ మార్కెట్ పెరుగుదలను బట్టి ఉంటుంది అన్న వాస్తవాన్ని మనం గుర్తించినప్పుడు యంత్రాల ప్రవేశం కారణంగా కార్మికుల వేతనాల కోసం అంతవరకూ వెచ్చించిన సొమ్ము తగ్గి లాభాలు పెరుగుతాయి. అదే సమయంలో లాభాలు పెరిగే రేటు తగ్గుతుంది. ఎలాగో చూద్దాం. యంత్రాల ప్రవేశం ఫలితంగా వెంటనే నిరుద్యోగం పెరుగుతుంది. శ్రామిక ఉత్పాదకత పెరుగు తుంది కాని వేతనాల ఖర్చు మాత్రం పెరగదు. అందువలన వేతనాలకు చేసే ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయి. కార్మికుల వేతనాలను వారు దాదాపు పూర్తిగా ఖర్చు చేస్తారు. కాని లాభాల్లో ఒక చిన్న భాగాన్ని మాత్రమే యజమానులు ఖర్చు చేస్తారు. అందువలన మొత్తం ఆదాయంతో పోల్చినప్పుడు మొత్తం వినిమయం తగ్గుతుంది. దాని వలన సరుకులు చెల్లుబాటు కాకుండా మిగిలిపోతాయి. అధికోత్పత్తి స్థితి ఏర్పడుతుంది. దాని ఫలితంగా వాస్తవంగా సంపద పోగుబడే రేటు తగ్గిపోతుంది. యంత్రాలను ప్రవేశ పెట్టడం వలన అంతిమంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న రికార్డో వాదనకు భిన్నంగా, వాస్తవానికి ఆ యాంత్రీకరణ ఉపాధి అవకాశాల పెరుగుదలను దెబ్బ తీస్తుంది. ఏదైనా ప్రత్యేక కాలాల్లో కొత్త యంత్రాలను వేటినీ ప్రవేశ పెట్టకుండా పాత స్థాయి యంత్రాలనే కొనసాగించినప్పుడు నిరుద్యోగం తగ్గవచ్చు. కాని అందుకు తొలుత చేపట్టిన యాంత్రీకరణ ఎంతమాత్రమూ కారణం కాదు. యాంత్రీకరణ కారణంగా ఎన్ని ఉద్యోగాలు పోయాయో వాటివరకూ అయినా తిరిగి కల్పించడం అనేది కొంతకాలం దాటిన తర్వాత కూడా జరగదు. రికార్డో చిత్రించిన ఈ పెట్టుబడిదారీ రూపం పెట్టుబడిదారీ విధానానికి ప్రమాణంగా నేటికీ ఆమోదించబడుతోంది. మొదట్లో ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా, అంతిమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అందరికీ సౌభాగ్యాన్ని అందిస్తుంది అని నమ్ముతూంటారు. ఐతే ఇది ఏమాత్రమూ వాస్తవం కాదు. పెట్టుబడిదారీ విధానం ప్రవేశపెట్టినప్పుడు తలెత్తే ఇబ్బందులను, కష్టాలను తర్వాత కాలంలో లేకుండా చేయగల ఏర్పాటు ఏదీ పెట్టుబడిదారీ విధానంలో లేనే లేదు. ఇక్కడ ఒక ప్రశ్న రావొచ్చు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం మొదట ప్రారంభం అయిన పశ్చిమ యూరప్ దేశాలలో ప్రజల జీవన పరిస్థితులు ప్రారంభం నాటికన్నా తర్వాత కాలంలో వాస్తవంగా చాలా మెరుగుపడ్డాయి కదా? ఇదెలా జరిగింది? పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి జరిగిన చారిత్రిక సందర్భాలు రెండు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. మొదటిది: యూరప్ నుంచి చాలా భారీ సంఖ్యలో కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి ఉష్ణ, సమశీతోష్ణ మండలాలలకు వలసలు పోయారు. ఈ దేశాలన్నీ వారి ఆక్రమణకు గురయ్యాయి. వారంతా అక్కడే స్థిరపడ్డారు. ఆ తర్వాత కాలంలో యూరప్ నుంచి ఇండియా, చైనా, ఇండోనేషియా, ఇండో–చైనా వంటి దేశాలకు పోయినవారు వాటిని తమ వలసలుగా మార్చుకున్నారు. మొదటి దశలో వలసలు పోయిన ప్రదేశాల్లో భూములను ఆక్రమించుకున్నారు. వాటిని సాగు చేయసాగారు. అప్పుడు యూరప్‌లో ఉండిపోయిన కార్మికుల కనీస వేతనాల స్థాయి పెరిగింది. నిరుద్యోగమూ తగ్గింది. ఆ విధంగా ఈ వలసలు యూరప్‌లో యాంత్రీకరణ దుష్ఫలితాలైన నిరుద్యోగం వంటివి కొనసాగకుండా చేయగలిగాయి. యూరప్ జనాభాతో పోల్చితే అక్కడి నుండి జరిగిన వలసల స్థాయి చాలా ఎక్కువ. దాదాపు 19వ శతాబ్దం అంతా, మొదటి ప్రపంచ యుద్ధం మొదలయే దాకా, యూరప్ నుండి వలసలు పోతూనే వున్నారు. వారు దాదాపు 5 కోట్ల మంది! బ్రిటన్ వంటి దేశంలోనైతే దేశ జనాభా వృద్ధి ఏటేటా ఎంత ఉండేదో, దాదాపు అందులో సగం మేరకు వలసలు ఉండేవి. ఇటువంటి స్థాయిలో వలసలు పోవడం, అది కూడా దీర్ఘకాలం పాటు కొనసాగడం వలన యూరప్ దేశాల్లో కార్మికులకు చాలా డిమాండ్ ఉండేది. ఆ దేశాలు యాంత్రీకరణ కారణంగా ఏర్పడిన నిరుద్యోగాన్నంతటినీ వలసల రూపంలో ఎగుమతి చేసేశాయని చెప్పవచ్చు. ఇది తమ తమ దేశాల హద్దులను దాటిపోయి ఇతర ప్రదేశాలను ఆక్రమించుకోడం కారణంగా జరిగిన పరిణామమే తప్ప అంతర్గతంగా ఆయా దేశాల్లోని పెట్టుబడిదారీ వ్యవస్థ పరిష్కరించినది కాదు.

ఇక రెండవ కారణం: తాము జయించి వలసలుగా మార్చుకున్న ఇండియా వంటి దేశాలలో స్థానికంగా ఉన్న పరిశ్రమలను నాశనం చేసి సామ్రాజ్యవాద వేశాలు తమ ఉత్పత్తులను ఆ వలస దేశాల మార్కెట్లలో ప్రవేశ పెట్టడం జరిగింది. అందువలన తమ స్వంత దేశాల్లో యాంత్రీకరణ కారణంగా తలెత్తే నిరుద్యోగాన్ని దేశీయ ఆర్థిక వ్యవస్థ ద్వారా గాక, ఇతర దేశాల్లో మార్కెట్లను ఆక్రమించడం ద్వారా పరిష్కరించుకున్నారు. ఇప్పటికీ మూడవ ప్రపంచ దేశాలలోని భారీ నిరుద్యోగాన్ని తమ స్వంత లాభాలను పెంచుకోడానికి వాడుకుంటూనే వున్నారు. ఈ విధంగా పశ్చిమ దేశాల్లో యాంత్రీకరణ ఫలితంగా తలెత్తిన నిరుద్యోగాన్ని వలసలకు పోవడం ద్వారా, కొన్ని దేశాలను వలసలుగా మార్చి దోపిడీ చేయడం ద్వారా పరిష్కరించుకున్నారన్న చారిత్రిక కారణాలను పరిశీలించకుండా, ఆ పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలలో యాంత్రీకరణ పర్యవసానాలను అక్కడి వరకే పరిశీలించడం వలన మనకు తప్పుడు నిర్ధారణలు వస్తాయి. ఆ దేశాల్లో యాంత్రీకరణ ఫలితంగా ఏర్పడిన నిరుద్యోగం తర్వాత కాలంలో అదృశ్యమైపోయినట్లే మన దేశంలో కూడా జరుగుతుందన్న భ్రమ కలుగుతుంది. ప్రస్తుతం మూడవ ప్రపంచ దేశాలకు చాలా కీలకమైన సమస్య ఇది. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ అను నిత్యమూ సాగించే ప్రచారాన్ని దైవ వాక్కులాగా స్వీకరిస్తున్నారు. మూడవ ప్రపంచ దేశాలు పెట్టుబడిదారీ విధానాన్ని ఎటువంటి పరిమితులూ, నియంత్రణలూ లేకుండా అమలు జరిపితే కాలక్రమంలో మన దేశాలు కూడా పశ్చిమ యూరప్ దేశాల మాదిరిగా సంపన్న దేశాలు అయిపోతాయన్నదే ఆ ప్రచారం. పశ్చిమ యూరప్ అనుభవాన్ని ఉదాహరణగా చూపించడం వలన వాస్తవాన్ని సక్రమంగా అర్థం చేసుకోలేని స్థితి ఏర్పడుతోంది. మన దేశంలో తొలి తరం ప్రణాళికావేత్తలు పి.సి.మహలనోబిస్ వంటి వారికి పశ్చిమ యూరప్ అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు పూర్తిగా తెలుసు. అందుకే వారు పెట్టుబడిదారీ విధానాన్ని దాని ఇష్టానికి వదిలి పెట్టలేదు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ నియంత్రణ తప్పనిసరిగా ఉండాలని వారు తలిచారు. అంతేకాక, చిన్న, కుటీర పరిశ్రమలను రక్షించడం ప్రభుత్వ విధానంలో భాగంగా ఉండాలని భావించారు. ఒకపక్క భారీ పరిశ్రమల స్థాపనను మహలనోబిస్ బలంగా సమర్ధిస్తూనే, రెండవ పంచవర్ష ప్రణాళిక నాటికి ఆయన ఉపాధి కల్పనకు, వినిమయ వస్తువులు ఎక్కువగా అందుబాటులోకి రావడానికి వీలుగా చిన్న, కుటీర పరిశ్రమల విస్తరణ జరగాలని నిర్దేశించారు. చైనాలో కూడా ఇదే కాలంలో ఇదే విధంగా ఆలోచనలు జరిగాయి. వలస విధానం నుండి విముక్తి పొందిన మూడవ ప్రపంచ దేశాలలో ఎక్కువ చోట్ల అమలు జరిగిందిదే. ప్రస్తుతం దేశంలో ఆర్థిక విధానాల మీద చర్చ దయనీయంగా దిగజారింది. 200 సంవత్సరాల క్రితం పెట్టుబడిదారీ విధానం గురించి ప్రచారం చేసిన అభూత కల్పనలనే నేటికీ వాస్తవం అని భావిస్తూ ప్రచారం చేస్తున్నారు. మూడవ ప్రపంచ దేశాల్లో, మన దేశంతో సహా, పేదరికం తగ్గిపోయిందంటూ అబద్ధాలను ప్రచారం చేస్తూ అభూత కల్పనలను సమర్ధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ అభూత కల్పనల నుండి ఎంత త్వరగా బైట పడితే దేశానికి అంత మంచిది.

# పిల్లల ఆట హక్కును హరిస్తున్నామా !

ఆటలు పిల్లల జన్మ హక్కు. బాల్యం ఆటలకు నెలవు. ఆటల్లో ఆనందాన్ని పొందడం చిన్నారులకు ఇష్టమైన ఏకైక దినచర్య. పిల్లలు, పాఠశాల విద్యార్థినీవిద్యార్థులు, యువత తప్పక ఆటలకు కొంత సమయాన్ని కేటాయించాలి. ఆటలతో అనేక ప్రత్యక్ష ప్రయోజనాలు ఉన్నాయి. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి ఆటలు దోహదపడతాయి. చిన్నారుల్లో సృజనశీలత పెంచడం, సామాజిక నైపుణ్యాలను వృద్ధి చేయడం, ప్రపంచ పోకడల గూర్చి అవగాహన పరుచుకోవడం ఆటలతో సుసాధ్యం అవుతుంది. ఆటల ద్వారా పిల్లలు తమ బావోద్వేగాలను వ్యక్తం చేయడం, నిలకడను అలవర్చుకోవడం, కొత్త విషయాలను నేర్చుకోవ డం, అమిత సంతోషాలను పొందడం జరుగుతుంది. ఆటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పిల్లల్ని ఆల్–రౌండర్లుగా తీర్చిదిద్దడంతో పాటు వారి ఉజ్వల భవితకు గట్టి పునాదులు వేయడం, ఆత్మవిశ్వాసంతో కూడిన బాధ్యతగల పౌరులుగా తయారు చేయడానికి తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆటలు ఒక వినోదాన్ని అందించే వేదికలు మాత్రమే కాదని, అన్ని వర్గాల, వయస్సుల వారికి ఆటలు ఒక సార్వత్రిక భాషగా జాతీయతాభావం, సాంస్కృతిక వికాసం, సామాజిక–ఆర్థిక ప్రగతి ముడిపడి ఉంటాయి. పిల్లలకు ఆటల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస చొరవతో ఆటల ప్రయోజనాలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సంరక్షకులు, విద్యాలయ యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, పౌర సమాజానికి వివరించడానికి ప్రతి ఏట 11 జూన్ రోజున "అంతర్జాతీయ ఆటల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ప్లే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ ఆటల దినం ఇతివృత్తంగా "ఆటలను ఎంచుకొండి – ప్రతి రోజు (చూజ్ టు ప్లే – ఎవ్రీ డే)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. పిల్లలకు చేరువగా ఆటలు తీసుకురావడానికి ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, పౌర సమాజం కూడా ప్రాధాన్యతాక్రమంలో చొరవ చూపాలి. ఆటల సంస్కృతిని కాపాడడం, ప్రోత్సహించడం, అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పిల్లల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని తెలుసుకోవాలి. నేర్చుకోవడానికి ఓ శక్తివంతమైన వేదిక ఆట స్థలం మాత్రమే. ఆటలతో పిల్లల్లో మేధో, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక, మానసిక, శారీరక అభివృద్ధి జరుగుతుంది. ఆటల ద్వారా జట్టుతో కలిసి పని చేయడం (టీమ్ స్పిరిట్), క్రీడా స్ఫూర్తి పెంపొందించబడడం, నాయకత్వ లక్షణాలు పెరగడం, నిలకడను నేర్చుకోవడం, సామాజిక సవాళ్లను ఎదుర్కోవడం, ఓటమిని ఆకళింపు చేసుకోవడం, భయాన్ని జయించడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ఊహాశక్తి, సృజనశీలత, ఆవిష్కరణ ద్వారాలు తెరుచుకుంటాయి. ఆటల ద్వారా పాఠాలు సులభంగా అర్థం కావడం, సమగ్ర శ్రేయస్సు ఒనగూడడం, ఆశావహ దృక్పథం పెరగడం జరుగుతుంది. ఆటలు పిల్లల్లో మానసిక ఉత్సాహాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, సంక్షోభాలు, విపత్తుల సమయంలో పిల్లల పరిస్థితులు దుర్భరంగా ఉంటాయి. ఇలాంటి సమయాల్లో పిల్లల్ని సంతోష పెట్టడానికి ఆటలు మాత్రమే సరైన సాధనాలుగా పని చేస్తాయి. నేటి విద్యావిధానంలో ర్యాంకులు, మార్కులు, గ్రేడ్ల వరదల్లో తల్లిదండ్రులు కూడా కొట్టుకుపోతున్నారు. పిల్లలు ఆడు కావడానికి తల్లిదండ్రులు సరైన సమయం కూడా ఇవ్వడం లేదు. ప్రపంచవ్యాప్తంగా 78 శాతం మంది పేరెంట్స్ ఆటలు అవసరమని భావించడంతో లేదని, 73 శాతం మంది పిల్లలు తమ తల్లితండ్రులు అనుమతించడం లేదని తెలపడం విచారకరం. పేదరికం, అవిద్య, సంక్షోభాలు, విపత్తులు, వివక్ష లాంటి అంశాలు పిల్లలను ఆటలకు దూరం చేస్తున్నాయి. ఆటల రూపంలో పాఠాలు నేర్పడం ఓ మహోన్నత బోధన పద్ధతి అని నేడు ప్లే స్కూల్స్ పేరుతో పాఠశాలలు వెలుస్తున్నాయి. ఆటల ఆధార బోధనలు పిల్లలకు సంతోషాలతో కూడిన చక్కటి, సులభమైన అవగాహనను కల్పిస్తున్నాయి. ఆటల ద్వారా పిల్లలకు ఓపిక, సహనం, సామాజిక సమ్మిళిత భావనలు, సంక్షోభాల నివారణ, శాంతి స్థాపన లాంటివి ఒనగూడుతాయి. పిల్లలు ఆడుకోకవం వారి కనీస మానవ హక్కు. అలాంటి ఆడుకునే హక్కును హననం చేస్తే పిల్లల ఉజ్వల భవితకు తీవ్ర విఘాతం కలుగుతుంది. పిల్లల జీవితంలో ఆటలు ఓ చక్కటి ప్రవర్తనకు మార్గం చూపుతాయి. ప్రపంచ పోకడలను ఆకళింపు చేసుకోవడం, విశ్వ రహస్యాలను ఆవిష్కరించుకోవడం, తమ లక్ష్యాలు ధైర్యంగా చేరుకోవడం, చక్కటి సంభాషణా చాతుర్యాన్ని అలవర్చుకోవడం, భావోద్వోగాలను నియంత్రించుకోవడం

# ప్రచారకాండ కాదు పార్లమెంటు ద్వారానే స్పందన

'నా నరాల్లో రక్తం కాదు, సింధూరం ప్రవహిస్తోంది' ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రచార హంగామా ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఎంచుకున్న తన తరహా మాటలివి. దేశం ఎదుర్కొంటున్న తీవ్ర సవాలు ముందుకొచ్చి నిల్చున్న తరుణంలో ఆయనగానీ ఆయన ప్రభుత్వంగానీ అంతకన్నా ఏం చేయగలుగుతుంది? ఈ సర్కారుకు ఎప్పుడూ ఏ సమయంలోనూ పారదర్శకత, అంతరావలోకనతో సంబంధం లేదు. ప్రధాన మంత్రిని కేంద్ర విగ్రహంగా నిలబెట్టడం చుట్టూనే మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం ఆధారపడింది. ఏకీకృత దౌత్యనీతిని అమలు చేయడం కన్నా ఒక విధమైన వ్యక్తి ఆరాధాన పెంచడమే పనిగా పెట్టుకుంది. విదేశాంగ విధానానికి మోడీ విగ్రహాన్ని అగ్రభాగంలో వుంచడమే ప్రధానంగా చేసుకోవడంతో సంప్రదాయకమైన విదేశాంగ విధానంలోని విజ్ఞత తలకిందులైంది. వ్యవస్థిత దౌత్య సంప్రదాయాలు తలకిందులై పోయాయి. చారిత్రకంగా భారతదేశ విదేశాంగ విధానం దాని అంతర్గత పునాదులపై ఆధారపడి రూపొందింది. సజీవమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్య విధానంతో నడిచే వైవిధ్యం, సామాజిక ఆర్థిక న్యాయాలకు కట్టుబాటు సూత్రాల దృఢత్వంపై ఆధారపడింది. ప్రపంచ దేశాలలో భారతదేశ ప్రతిష్ట పెరగడానికి ఈ సూత్రాలు గట్టి ప్రాతిపదికగా పనిచేశాయి. బహుళత్వంతో కూడిన ఒక దేశపు సమాన పౌరసత్వంపై ఆధారపడిన భిన్నత్వంలో ఏకత్వం భారత రిపబ్లిక్‌కు విలక్షణమైన సంకేతంగా వుంటూ వచ్చింది. ఈ వారసత్వం దెబ్బతినిపోవడమే ఇప్పటి విషాదం. క్రమబద్ధమైన సూత్రాలపై ఆధారపడిన విదేశాంగ విధానం స్థానంలో వ్యక్తి కేంద్రకంగా వ్యక్తిగత ఇమేజి ప్రాతిపదికగా నడిచే దౌత్యనీతి ఆక్రమించింది. అయితే ఈ విధానం నిలిచేది కాదు. ప్రత్యేకించి ఇండియా వంటి దేశానికి. దశాబ్దాల పాటుసాగిన సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ స్వాతంత్ర పోరాటంతో ఈ దేశానికి అంతర్జాతీయ ప్రతిష్ట ఏర్పడింది. ఆ క్రమంలో అది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్‌గా రూపు దాల్చింది. ఈ వారసత్వం నుంచి దూరం కావడం అనేది ఆరెస్సెస్ డీఎన్‌ఏ లోనే వున్న లక్షణం.పహల్గాం హత్యాకాండ నేపథ్యంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వం ఎట్టకేలకు 'నిఘా లొసుగులు' వున్నాయని ఒప్పుకోక తప్పలేదు. అయితే ఈ ఒప్పుకోలు చాలా ఆలస్యంగా అరకొరగానే జరిగింది. ఇప్పటికీ ప్రభుత్వం ఈ లొసుగులు ఎలాంటివో ఎంత విస్తృతంగా వున్నాయో మాత్రం స్పష్టీకరించలేదు. వైమానిక దళ ప్రధానాధికారి అనిల్ చౌహాన్ సింగపూర్‌లో ఒక భద్రతా సదస్సు సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజుల ఘర్షణలో యుద్ధ విమానాల నష్టపోయామని ఒప్పుకున్నారు. అయితే అంతకు మించి ఆయన మరేమీ చెప్పలేదు. అలాంటి అసంపూర్ణ వివరణలు, వైఫల్యం లోతుపాతులు పూర్తిగా వివరించ జాలవు. ప్రస్తుత సంక్షోభం రీత్యా మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలన రికార్డు–మరీ ముఖ్యంగా 370వ అధికరణం రద్దు తర్వాత–ఎలా వుందో విస్మరించలేము. 370వ అధికరణం తీసిపారేయడం, విలీన ఒప్పందంతో ముడిపడిన కీలక చారిత్రక సత్యాలను తోసిపుచ్చడం భారత యూనియన్‌లో జమ్ముకాశ్మీర్ కలసిపోయినప్పటి వారసత్వాన్ని దెబ్బతీశాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో జమ్ముకాశ్మీర్ ప్రజలు ప్రత్యేకించి లోయవాసుల పాత్రను వమ్ము చేశాయి. పహల్గాం తర్వాత ఇది మరింత కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది. ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా లోయ పొడుగునా వున్న ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెల్పిన పరిస్థితులలో శక్తివంతమైన ఈ ప్రజా ఐక్యతను చాలా సానుకూల పరిణామంగా చూడవలసి వుండింది. కాని ప్రభుత్వం ఆ వాస్తవాన్ని గుర్తించడం గానీ అభినందించడం గానీ జరగలేదు. అందుకు బదులుగా కాశ్మీర్ ప్రజలనే ఈ దాడిలో ఇరికించేందుకు ప్రయత్నాలు జరిగాయి. దానివల్ల ప్రభుత్వ నిజమైన ఉద్దేశం ఏమిటో అసలైన సైద్ధాంతిక దృక్పథం ఏమిటో బహిర్గతమైంది. గతంలో ప్రభుత్వాలు రాజ్యాంగంలోని ప్రజాస్వామ్య, లౌకిక సూత్రాలను నిలబెట్టేవిధంగా నిష్పక్షపాత వైఖరితో వ్యవహరిస్తే దాని స్థానంలో ప్రజలనూ అటూ ఇటూ రెండుగా విభజించే విధానం తెచ్చిపెట్టారు. టెర్రరిజంపై పోరాటం కేవలం సైనిక ఘర్షణగానే పరిమితం చేయడం కుదిరేపని కాదు. నిజంగా శాంతిని కోరుకుంటే విధాన స్పష్టత వుండాలి. జాతీయ సమైక్యతను పటిష్టం చేసే చర్యలలో అది ప్రతిబింబించాలి. విదేశాంగ విధానం, దౌత్యం వేర్వేరు ప్రయత్నాలు కాదు. దేశీయ విధానాల కొనసాగింపే అవీ. మతపరమైన సమీకరణ పెంచడమూ, ప్రజాస్వామిక హక్కులూ మైనార్టీల హక్కులను హరించడం గత పదకొండేళ్ల పరిణామాలు గమనిస్తే ప్రధానంగా వుంటున్న దాటవేయలేని వాస్తవం, ప్రత్యేకించి ఇప్పుడున్న పరస్పర సంబంధిత సమాచార చోదిత అంతర్జాతీయ సందర్భంలో అలా సాధ్యమయ్యేది కాదు. పహల్గాం దాడి తర్వాత ముస్లింలపై 184 ముస్లిం వ్యతిరేక విద్వేష నేరాలు జరిగినట్టు పౌర బృందాలతో కూడిన ఒక నిజ నిర్ధారణ సంఘం నివేదించింది. మొత్తంగా ముస్లింలు ప్రత్యేకించి కాశ్మీరీలు లక్ష్యంగా ఈ నేరపూరత చర్యలు జరిగాయి. ఈ చర్యలు నిరాటంకంగా సాగుతూనే వున్నాయి. పహల్గాం హత్యాకాండకు సంబంధించి సాధికారికమైన ఆధార పత్రాల సేకరణ, ప్రభుత్వ ప్రేరిత ఉగ్రవాద బృందాల సీమారంత కార్యకలాపాల పథకాల వివరాలు జరక్కపోవడం అంతర్జాతీయ వేదికలపై భారత వాదనలను మరింత బలహీనం చేసింది. పాకిస్తాన్ ఉద్దేశాల విషయంలో దేశ ప్రజలు నిజమని భావించచ్చుగాని అంతర్జాతీయ సమాజాన్ని ఒప్పించాలంటే మరింత బలమైన పారదర్శక సాక్ష్యాధారాలు కావాలి. మాజీ సైనిక దళాల ప్రధానాధికారి జరనల్ మనోజ్ నిర్వాణే మాటల్లో అలాంటి అరుదైన ఒక స్పష్టత కనిపించింది. "యుద్ధమేమీ కాల్పనిక కవిత కాదు. మీ బాలీవుడ్ సినిమాలా వుండదు. అది చాలా తీవ్రమైన వ్యవహారం. బుద్ధిహీనులు మనపై యుద్ధం రుద్దినా మనం దానిపై కేరింతలు కొట్టవలసింది లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. శాంతియుత చర్చలకే ప్రాధాన్యతనిస్తూ యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. ఈ దౌత్యపరమైన ప్రయత్నాల విస్తరణలో భాగంగా వివిధ పార్టీలకు చెందిన 59 మంది ఎంపీల బృందాలు 32 దేశాలలో పర్యటిస్తున్నాయి. విదేశాలలో పార్లమెంటు సభ్యులకు, నిపుణలకు మేధావి బృందాలకు మీడియా ప్రతినిధులకు పహల్గాం సంఘటనపై భారత ప్రభుత్వ వైఖరిని తెలియజేయడం ఈ యాత్రల లక్ష్యం. అయితే ఇలా వెళ్లిన దేశాలలో భారత్ ఇరుగు పొరుగు దేశం ఒకటైనా లేదు. 'నా నరాల్లో రక్తం కాదు, సింధూరం ప్రవహిస్తోంది' అంటున్న ప్రధాని నరేంద్ర మోడీ మాటలతో సహా దేశంలో చెప్పుకుంటున్న దానికి ఈ దౌత్య యాత్రలు పూర్తి భిన్నమైన దిశలో నడుస్తున్నాయి. టెర్రరిస్టు వ్యతిరేక చర్యలే ఈ ప్రభుత్వ అతి గొప్ప విజయాలుగా చేస్తున్న ప్రకటనలూ ఇందుకు విరుద్ధంగానే వున్నాయి. అయితే ఆలస్యంగా మొదలైన ఈ దౌత్య యాత్రల ప్రయత్నం ఏ మేరకు జయప్రదమవుతుందో ఇప్పటికే తేలిపోయింది. పాకిస్తాన్ ఐఎంఎఫ్ దగ్గర పది వేల కోట్ల డాలర్లు, ప్రపంచ బ్యాంకు దగ్గర నాలుగు వేల కోట్ల డాలర్లు అప్పు తెచ్చుకోవడానికి ఎవరి నుంచి ఎలాంటి వ్యతిరేకతా లేకపోయింది. ఇజ్రాయిల్, ఆఫ్ఘనిస్థాన్ లోని తాలిబాన్ ప్రభుత్వం తప్ప మరే దేశమూ భారత వైఖరిని సమర్థించింది లేదు. వాస్తవాలను కప్పిపుచ్చడం వల్ల ఎవరికీ ప్రయోజనం వుండదు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సింధు జలాల ఒప్పందాన్ని హఠాత్తుగా తిరస్కరించడంతో ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. సరిహద్దులలోని నదుల నీళ్లను వాటి పైన కింద గల పరీవాహక ప్రాంతాల వినియోగ హక్కును గుర్తించడం అంతర్జాతీయ అంగీకృత సూత్రం. పరస్పరం కదుర్చుకున్న ఒక ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలగడం పట్ల ప్రపంచ దేశాల మద్దతు లభించడం కష్టం. ఆచరణలో చూస్తే భారత దేశానికి నదీ ప్రవాహాన్ని ఆపివుంచేందుకు అవసరమైన రిజర్వాయర్ సామర్థ్యం కూడా లేదు. ప్రభుత్వం నీటి ప్రవాహం వివరాలు ప్రచురించడం మానేసింది. అంటే దీనివల్ల వరదలో లేక కరువులో వస్తే పాకిస్తాన్ రైతులు, సామాన్య ప్రజలే అత్యధికంగా నష్టపోతారన్నమాట. వారు భారతీయులైనా పాకిస్తాన్ ప్రజలైనా టెర్రరిజంపై పోరాటం టెర్రరిస్టులపై జరగాలి గానీ ప్రజలపై కాదు. టెర్రరిస్టులను ఏకాకులను చేయాలి. మొత్తం ప్రజలపై పోరాటం ఎన్నటికీ సానుకూల ఫలితాలను ఇవ్వజాలదు. ఒక సమగ్రమైన సూత్రబద్ధమైన వ్యూహానికి మారుగా వ్యూహాత్మక చర్యలకు దిగడం వల్ల ప్రయోజనం లేదు. సరిగ్గా ఈ కారణం వల్లనే ప్రతిపక్షాలు ఈ సంక్షోభానికి సంబంధించిన అన్ని కోణాలు చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపాలని కోరుతున్నాయి. అలాంటి ప్రత్యేక సమావేశమే వాతావరణంలో స్పష్టత తెచ్చేందుకు సరైన వేదిక అవుతుందని 16 ప్రతిపక్షాలు ప్రభుత్వానికి లేఖ రాశాయి.

# ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కారించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి

**యాదాద్రి భువనగిరి, జూన్ 10( సూర్య ప్రతినిధి):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ కోరినారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ కు సంఘం ఆధ్వర్యంలో మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తున్నదని ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని, మున్సిపల్ పట్టణాల్లో, నగర పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను పేదలకు, వ్యవసాయ కూలీలకు కల్పించాలని, ఉపాధి హామీ కార్మికులకు గడ్డపార, తట్ట, పారా, కొడవలి, గొడ్డలి లాంటి పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశంలో కార్మికులకు త్రాగడానికి మంచినీరు ప్రతి గ్రామ పంచాయతి నుండి అందించాలని, పని ప్రదేశంలో నీడ కోసం టెంట్, ప్రమాదంలో గాయపడితే చికిత్స కోసం మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలని, నూతన జాబు కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇవ్వాలని, నూతన పేర్లను కూడా చేర్చాలని, ఖాళీగా ఉన్న ఫీల్డ్ భర్తీ చేయాలని, పని ప్రదేశంలో కూలీలను రోజుకు రెండు సార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాని, సమ్మర్ అలవెన్సులు, నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీలు చట్ట ప్రకారం ఇవ్వాలని, ఆధార్ కార్డుతో లింక్, ఆన్ లైన్ పేమెంట్ చెల్లింపులు, కొలతల ఆధారంగా వేతనాలు ఇచ్చే పద్ధతిని రద్దు చేయాలని, చేసిన పనికి వారం వారం పే స్లిప్పులు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి, ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేసి నెలకు 25 వేల రూపాయలు



ఇవ్వాలని, వాచర్లను, సీనియర్ మేట్లను ప్రత్యేకంగా గుర్తించాలని, సంవత్సరం మొత్తం పనులు కల్పించాలని, అర్హత కలిగిన వారికని ఎఫ్.ఏ.లు గా ప్రమోషన్ ఇవ్వాలని, పని ప్రదేశంలో ప్రమాదం జరిగి కార్మికులు గాయపడితే ఏ ఆసుపత్రికలోనైనా ఉచిత వైద్యం చేయించాలని, పని చేయని రోజులలో కూడా కూలీ డబ్బులు చెల్లించాలని, పని ప్రదేశంలో ప్రమాదం జరిగి మరణిస్తే 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, పని కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పని ఇవ్వకుంటే చట్ట ప్రకారం నిరుద్యోగ భృతి చెల్లించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోషల్ ఆడిట్ కమిటీలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులకు కూడా అవకాశం కల్పించాలని, గత ఎనిమిది సంవత్సరాలుగా ఒకే మండలంలో పనిచేస్తున్న ఏపీఓ లను వెంటనే మార్చాలని, ఖాళీగా ఉన్న ఏ పీ ఓ పోస్టులను భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ కి ఇచ్చిన మెమోరండం ద్వారా ప్రభుత్వాన్ని నర్సింహ డిమాండ్ చేసినారు.

# అంబిటాస్ ప్రైవేటు విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి





**విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి**

**విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలి**

**ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్ష కార్యదర్శులు దాసరి ప్రకాష్,తీగుళ్ల శ్రీనివాస్**

**చౌటుప్పల్,జూన్ 10( సూర్య ప్రతినిధి):** ఎలాంటి అనుమతులు లేకుండా అంబిటాస్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారాన్ని చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యా హక్కు చట్టాన్ని ప్రకటిబందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్ష కార్యదర్శిలు దాసరి ప్రకాష్ తీగుళ్ల శ్రీనివాస్ అన్నారు... మంగళవారం చౌటుప్పల్ మండలంలోని అంబిటాస్ ప్రవేట్ విద్యాసంస్థల్లో ఇలాంటి అనుమతులు లేకుండా స్కూల్లో బుక్స్ యూనిఫామ్స్ అమ్ముతున్నారని తెలుసుకొని స్కూల్లో ముందు ధర్నా చేసి బుక్స్ ను మండల విద్యాశాఖ అధికారులతో సీజ్ చెప్పేయడం జరిగింది ఈ సందర్భంగా దాసరి ప్రకాష్ తీగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.... ఎలాంటి అనుమతులు లేకుండా పర్మిషన్ లేకుండా అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రులను మోసం చేసి వేలాది రూపాలు వసూలు చేస్తున్నారాని , అనుమతులు లేకుండా అంబికా స్కూల్లో అమ్ముతూ విద్యా వ్యాపారాన్ని కొనసాగుతున్నారని విద్య అనేది సరుకుగా మారిందని విద్యను విద్య లాగే కాకుండా సరుకుగా మార్చుకొని వేలాదిరూపాలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేసి దోచుకుంటున్నారని ఇలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ అనుమతి లేకుండా ప్రవేటు పాఠశాల నడుస్తున్న గాని విద్యాశాఖ అధికారులు చూసి చూడంగా వ్యవహరిస్తున్నారు తక్షణమే అధికారులు అనుమతి లేకుండా ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి వాటి గుర్తింపు రద్దు చేయాలని విద్యా వ్యాపారం కాకుండా విద్య అందరికీ అందేలా విద్యాభ్యాసం ఉండాలని విద్యా హక్కు చట్టాన్ని ప్రకటిబందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి సాతిరి మనోజ్ మండల ఉపాధ్యక్షుడు దోనూరు శ్రావణ్,వరుణ్ మండల కమిటీ సభ్యులు చీమకండ్ల కిషోర్ ,జయంత్ ,వెంకట్, సిద్దు, మహేష్,శ్రావణ్ ,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోషిక ఐలయ్య**

**రైట్ అప్ అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఐలయ్య**







**తుర్కయంజాల్,జూన్ 10,ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని మాజీ 22వ వార్డ్ కౌన్సిలర్,కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోషిక ఐలయ్య అన్నారు.మంగళవారం మున్సిపాలిటీ 22వ వార్డులోని ఇందిరమ్మ కాలనీ నుండి లక్ష్మీ నగర్ మీదుగా హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 65 లక్షలతో సీసీ రోడ్డు పనులు ఐలయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచనని అన్నారు.కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఇప్పటికే విడతలవారీగా గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పడిన కొత్త కాలనీ లో సీసీ రోడ్లు,డ్రైనేజీ పూర్తి చేసామని తెలిపారు.కాలనీలో అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు ప్రారంభించి వాటిని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కళ్యాణ్ నాయక్,నాయకులు మోహన్ నాయక్ ,వెంకటేష్ యాదవ్, వెంకట్ రావు, వేముల శంకర్, రాగ్య నాయక్, దేశ నాయక్ , హనుమంత్ గౌడ్ రాజు నాయక్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ జన్మదిన వేడుకలు



**రాజపేట, జూన్ 10( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ పక్షాన రాజపేట మండల నాయకులు, రాష్ట్ర నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్ర గోకుల జశ్వంత్,చామకూర గోపాల్ గౌడ్, సంధిలా భాస్కరు గౌడ్, గోపగాని బాలమణి,యాదగిరి గౌడ్, బెడిద వీరేశం, దొంకెన మహేందర్ గౌడ్,రామిండ్ల నరేందర్, నర్సిరెడ్డి,ఏమ్మా భాస్కర్,గంధమల్ల సురేష్, ఠాగూర్ భగత్ సింగ్,ములుగు సోమలింగం, జానకి రాములు, కూతురు లింగం, గజ్జల రాజు, గుర్రం బాబు, చెరుకు కనకయ్య,గుంటి రాజయ్య, వెంకటేశం, సందుల వెంకటేశం, ఎర్రగోకుల చంద్రయ్య, లక్ష్మణ్ నాయక్, గౌలన రవి, రాణి, లక్ష్మణ్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పున్న కైలాస్ నేత జన్మదిన వేడుకలు

**కేకు కట్ చేసి పండ్లు పంపిణీ చేసిన కైలాష్ నేత వీరాభిమాని కైసర్**



**సంస్థాన్ నారాయణపుర్, జూన్ 10( సూర్య ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండలం కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు ఓయూ జేఏసీ విద్యార్థి ఉద్యమ నాయకులు మునుగోడు ముద్దుబిడ్డ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత జన్మదిన వేడుకల సందర్భంగా కైలాష్ నేత వీరాభిమాని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.అనంతరం ఆసుపత్రిలో ఉన్నా రోగులకు,వృద్ధులకు ఆసుపత్రి సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉస్మానియా యూనివర్సిటీలో అనేక ఉద్యమాలు నడిపి లాఠీ దెబ్బలు వందల కేసులతో జైలు జీవితం గడిపిన గొప్ప ఉద్యమ నాయకులు పున్నా కైలాష్ నేత అని అన్నారు.వారి జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని వారు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలనీ వారు ఆయురారోగ్యాలతో ఉండాలంటూ మాస్ఫూర్తిగా కోరుకుంటూ వారికి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది.రాబోయే రోజుల్లో ఆయన కాంగ్రెస్ పార్టీలో మంచి పదవిలో ఉండాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని ఆయన అన్నారు. ఈ వేడుకల్లో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు ఎండీ రహీం షరీఫ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పగిల్ల నరేష్,పత్రిక విలేకరులు కిషోర్ నేత, బోయ అనిల్ కుమార్,వైద్య సిబ్బంది,రోగులు,వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీలో ఏ పదవులు దక్కకుండా చేస్తున్నారు

**-ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు అమలు చేస్తున్న సీఎం రేవంత్**

**-ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు మైనార్టీలపై వివక్ష చూపిస్తున్నారు**




**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్రంలో ఇటు ఖమ్మం జిల్లాలో ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీలో ఏ పదవులు దక్కకుండా ఆర్ఎస్ఎస్ వాదులు వివక్షత చూపిస్తున్నారని బీఆర్ ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఆరోపించారు. నిన్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మైనార్టీ వ్యతిరేక విధానాలపై మీడియా సమావేశంలో జిల్లా బిఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ 23 డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ నాయకుడు షేక్ మహ్మద్ రసూల్ మాట్లాడుతూ మైనార్టీల మీద కక్షగట్టి మైనార్టీలను అణగదొక్కి మైనార్టీల ఆత్మ అభిమానాన్ని బలి తీసుకునేటట్టు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు.ఈ ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లు ముఖ్య పదవులన్నీ వారి సామాజిక వర్గాలకే పంచుకున్నారు తప్ప మైనార్టీలకు ఒక్క పదవి కూడా ఇవ్వకపోవడం చాలా దారుణం అన్నారు.షాదీ ఖాన శంకుస్థాపన చేసిన దాన్ని బఫర్ జోన్ పేరు చెప్పి నిలిపి వేశారు. కొత్త షాదీ ఖానా ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మోసం చేశారని ఆరోపించారు. ఖమ్మంలో మైనార్టీ భవన్ కి కనీసం స్థలం కూడా కేటాయించలేదని అన్నారు. మైనార్టీలకు అన్ని విధాల అనగదొక్క ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రంజాన్ కి ఇచ్చే కేసిఆర్ కిట్ ఎటు పోయిందో అర్థం రంజాన్ కి ఇచ్చినంటి ఇఫ్తార్ విందులు ఏమైనాయని అర్థం కావట్లేదు రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని అమలుపరుస్తున్నాడు. ఈ కాంగ్రెస్ పార్టీలో ఉండి అని నేను బిజెపి స్కూల్ కాలేజీ తెలుగుదేశం అని చెప్పి అంటే ఆయన స్కూల్ లైఫ్ లోనే మైనార్టీల పట్ల ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సద్దాం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**–అంగవాడి కేంద్రంలో స్కూల్ రీ ఓపెనింగ్ సెల్ఫి డే**




**ఖమ్మం ( సూర్య ప్రతినిధి)** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపల్ పరిధిలోని లోని వార్డు నెంబర్ రెండు లో గల రాజీవ్ గృహ కల్ప కాలనిలోని అంగవాడి కేంద్రంలో స్కూల్ రి ఓపెనింగ్ సెల్ఫి డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ పుష్పలత సభ్యులు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్పందన పేరెంట్స్ గ్రామ పెద్దలు దేవరకొండ రవి చికటి శ్రీను నగేశ్ అంగన్ వాడి టిచర్లు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీలో మైనార్టీలపై వివక్ష

**–20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన వారికి ఎలాంటి పదవులు లేవు**

**–జంపింగ్ తో కాంగ్రెస్ లోకి వచ్చిన వారికి కీలక పదవులు**



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)**ఖమ్మం జిల్లాలో ముస్లింలు కాంగ్రెస్ పార్టీ కి ఓటు బ్యాంకు గా ఉంటున్నారు. చోటేబాబా మహమ్మద్ జావిద్ వంటి సీనియర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు గత 20- 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం సేవలందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో కి ఈ మధ్య వచ్చిన అగ్ర నాయకులు ముస్లిం మైనార్టీలకు పదవులు దక్కకుండా చేస్తున్నారు. ఎమ్మెల్యే రేస్ లో ఉన్న మహమ్మద్ జావేద్ కి తీవ్ర అన్యాయం చేశారు. రాష్ట్ర జిల్లా స్థాయిలో ఎలాంటి పదవులు సైతం ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. నిన్న ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి పదవులలో సైతం పలు పార్టీలు మారి మొన్న కాంగ్రెస్ పార్టీలో చేరినవారికే కీలక పార్టీ పదవులు అప్పగించారు. మైనార్టీ నేతలపై వివక్ష కొనసాగించారు. దీంతో ఖమ్మం జిల్లాలో ముస్లిం మైనార్టీలు భగ్గుమంటున్నారు. అటు రాష్ట్రంలోనూ ముస్లిం మైనార్టీలకి మంత్రి పదవులు రాకుండా అడ్డుకోవడం ఇటు ఖమ్మం జిల్లాలో సైతం సీనియర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులను పక్కన పెట్టేస్తున్నారు. దీంతో ముస్లిం సామాజిక వర్గంలో ఆగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. ముస్లిం మైనార్టీలకు గ్రూప్స్ డిఎస్సీ బ్యాంక్ జాబ్స్ శిక్షణ ఇచ్చే మైనార్టీ స్టడీ సర్కిల్ కు భూమి కేటాయించాలని మైనార్టీ నాయకులు పలు సార్లు మంత్రులకు విన్నవించిన ఇప్పటివరకు కాంగ్రెస్ పాలకులు స్పందించలేదు.

## అంబరాన్ని తాకిన ముత్యాలమ్మ దేవర మహోత్సవం

**- అమ్మ ముత్యాలమ్మ.. చల్లగా చూడు తల్లి అంటూ.. పోటెత్తిన భక్తులు...**

**- అమ్మవారికి బోనాలు ఎత్తిన భక్తులు**

**- దేవర సందర్భంగా విశేష పూజలందుకున్న ముత్యాలమ్మ**

**- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు**






**గుంతకల్లు, జూన్ 10(సూర్య ప్రతినిధి):** గుంతకల్లు మండల పరిధిలోని జి కొట్టాల గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మ తల్లి దేవర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవర మహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు పోటెత్తారు. ఉదయం ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజు ఇంటి బోనాలతో అడుగడుగునా జలాభిషేకం చేస్తూ నీరాజనంతో సాయంత్రం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. డప్పు వాయిదాలతో, బాణసంచలో అమ్మవారిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దేవర మహోత్సవానికి ఎలాంటి సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.




# గ్లైఫోసేట్ - జీవవిధ్వంసక విషం!

**గడ్డినే కాదు జీవులను చంపే విషపు రసాయనం**

**వ్యవసాయ విప్లవంలో జీవ హంతకుడిగా రూపాంతరం చెందిన గడ్డి మందు**

**భూమిలో జీవానికి భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును పూర్తిగా నిషేధించని వ్యవస్థలు, వాడకంపై పరిమితిని విధించాయి, కానీ కొన్ని చోట్ల నిషేధం వున్నా, పరిమితులు వున్నా యేదేచ్ఛగా క్రయ విక్రయాలు, వాడకాలు జరుగుతున్నాయి**



**అనంతపూర్, జూన్ 10( సూర్య ప్రతినిధి):** భూమి పుడమిలో జీవాన్ని హరించేది కలుపు కాదు ,కలుపును చంపుతున్న మానవ చర్యలే. దానికి అధినాయకుడిగా మారినది గ్లైఫోసేట్ అనే నాన్–సెలెక్టివ్ హెర్బిసైడ్. ఇది వాడిన భూమిలో జీవం మిగలదు. ఇది ఉన్న చోట మట్టి శ్వాస తీసుకోలేదు, పంటల మీద పడితే మాడి పోతాయి, అది వాడిన గడ్డిని తినే మూగ జీవాలు మృత్యువాత చెందుతాయి, రైతులు, ప్రజలు తీవ్రమైన అనారోగ్యల బారిన పడతారు

### గ్లైఫోసేట్ అంటే ఏమిటి?

గ్లైఫోసేట్ అనేది ఒక బ్రాడ్–స్పెక్ట్రం కలుపు నివారణ మందు. దీన్ని అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ మొదటిసారిగా 1970లో "రౌండప్" అనే బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి తెచ్చింది. ఇది మొక్కలలోని "ఈ పి స్ పి సింతసిసే" అనే ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి మొక్కల పెరుగుదల నిలిపేస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు మొక్కల కోసం వాడతారన్నప్పటికీ, ఇది పంట మొక్కలు, మట్టి జీవులపై కూడ తీవ్రమైన ప్రభావం చూపుతుంది.

### రైతు ఖర్చు తగ్గడానికి మాయదారి – ఆరోగ్యానికి మృత్యుదారి!

రైతులు కూలీల ఖర్చు తగ్గించేందుకు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కానీ దీని వలన వారు కలుపును చంపుతున్నట్టు కనిపించినా, భవిష్యత్తులో ఆరోగ్య ఖర్చులు, భూమి నష్టాలు, దిగుబడి తగ్గుదల వంటివి మరింత నష్టం తెస్తున్నాయి.

2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధ్యయన ప్రకారం, గ్లైఫోసేట్ పిచికారి చేయడమే కారణంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్రంగా అనారోగ్యానికి గురవుతున్నారు.

ఎయిమ్స్ నివేదిక ప్రకారం గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల అభివృద్ధిలో లోపాలు 18% పెరిగాయి.


### పర్యావరణ ప్రభావం – భూతాపానికి మూలం!

గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు నశించి, హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. దీని వలన వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది.

యునైటెడ్ నేషన్స్ ఐ పి పి సి 2022 నివేదికలో స్పష్టం: ఈ "హెర్బిసైడ్ వినియోగం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి."

### భారతదేశంలో గ్లైఫోసేట్ ప్రస్థానం

భారతదేశంలో గ్లైఫోసేట్ అనధికారికంగా "తీవ్రంగా ప్రమాదకరమైన రసాయనం"గా గుర్తించబడినా, ఇప్పటికీ ఇది గ్రామీణ ప్రాంతాల్లో స్వేచ్ఛగా లభిస్తోంది. 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం పాక్షిక నిషేధాన్ని ప్రకటించినా, అది కేవలం నామమాత్రమే. వ్యవసాయ శాఖకి చెందిన పలు రాష్ట్ర శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని దానంతటదే ప్రోత్సహిస్తూ కనిపించడం శోచనీయం.



ప్రపంచ దేశాల గ్లైఫోసేట్ నిషేధాలు %–% తాత్కాలిక బంధనాలు

**శ్రీలంక:**

2015లో గ్లైఫోసేట్ నిషేధం. సి కె డి యూ (క్రానిక్ కిడ్నీ డిసీస్ ఆఫ్ అన్నోన్ ఆరిజిన్) పెరగడంతో నిషేధం విధించారు కానీ అది ఎంతో కాలం కొనసాగలేదు జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు 2025 లోపే గ్లైఫోసేట్ నిషేధానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి.

**అమెరికా:**

2018లో కాలిఫోర్నియాలో మొదటిసారి కంపెనీపై కేసు నెగ్గిన రైతుకు 289 మిలియన్ డాలర్లు నష్టపరిహారం విధించబడింది. ఇప్పటివరకు 100,000కి పైగా కేసులు దాఖలయ్యాయి.

**కెనడా:**

ఫుడ్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ గ్లైఫోసేట్ అవశేషాలు ఆహార పదార్థాల్లో మించిపోతున్నాయని హెచ్చరికలు జారీ చేసింది. కానీ ఈ నిషేధాలు అన్నీ ఎంతో కాలం కొనసాగలేదు మళ్ళీ దాని వాడకం ఆయా దేశాల్లో ఏదేచ్ఛగా పెరిగింది

తెలుగు రాష్ట్రాల్లో %–% నిషేధాల మాయా !

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అప్పట్లో 60 రోజుల తాత్కాలిక నిషేధం విధించినా%ా% మార్కెట్లలో బహిరంగంగా గ్లైఫోసేట్ లభిస్తోంది. రాష్ట్రాలకు శాశ్వత నిషేధానికి అధికారం లేకపోవడమే దానికి ప్రధాన కారణం. కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు మాత్రం రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధం అమలు చేయగలిగాయి.

గ్లైఫోసేట్ మానవ ఆరోగ్యంపై ప్రభావాలు %–% డబ్ల్యూహెచ్ఓ, ఐఏఆర్సి నివేదికలు

డబ్ల్యూహెచ్ఓ కి చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ పర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ 2015లో గ్లైఫోసేట్‌ను "ప్రాబబుల్ హ్యూమన్ కార్సిజెన్ (గ్రూప్ 2ఏ)"గా ప్రకటించింది. ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది:

క్యాన్సర్
గర్భస్థ శిశువుల లోపాలు
నాడీ వ్యవస్థ లోపాలు
శ్వాస సమస్యలు
చర్మ సమస్యలు, అలర్జీలు
మూత్రపిండాలు, కాలేయ సమస్యలు

ఇది కేవలం ఆరోగ్య సమస్య కాదు %–% ఇది సామాజిక న్యాయ పోరాటం!

విషపదార్థాన్ని తక్కువ ఖర్చు, తక్కువ శ్రమ అంటూ విక్రయించడం రైతుల ఆర్థిక, శారీరక జీవితాలను చీకట్లో నెట్టివేస్తోంది. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, పరిశోధన సంస్థలు రైతుల అభివృద్ధికి మార్గం చూపించాల్సిన బాధ్యతను వదిలి కార్పొరేట్ కంపెనీల వ్యాపార స్వార్థలకు ఒత్తిడిలో వదిలేస్తున్నారు

### పరిష్కార మార్గాలు

గ్లైఫోసేట్‌పై శాశ్వత నిషేధం విధించాలి
జీవ, సేంద్రియ కలుపు నివారణ పద్ధతుల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి
రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి
సేంద్రియ విత్తనాలు, జీవ ఉత్పత్తుల అందుబాటు పెంచాలి
విపత్తులను నివారించే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
గ్లైఫోసేట్‌పై అవగాహన ప్రచారాలు గ్రామస్థాయిలో నిర్వహించాలి
భూమిని బతికించాలి అంటే గ్లైఫోసేట్‌ను చరిత్రగతం చేయాల్సిందే!

రైతు శ్వాస బతికుండాలంటే, మట్టిలో జీవం కొనసాగాలంటే, భవిష్యత్ పంటల భద్రత కోసం గ్లైఫోసేట్‌కు శాశ్వతంగా చరమగీతం చెప్పాలి!

ఒక రైతు కాదు ,ఒక మట్టి కాదు ఒక తరం కాదు, దేశ భవిష్యత్తే ప్రమాదంలో ఉంది. దీన్ని మౌనంగా చూస్తే మనం కూడా జీవిత వ్యతిరేక శక్తుల సహకారులమే అవుతాం. ఇప్పటికైనా రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర పాలకులు, శాస్త్రవేత్తలు కలసి జీవరక్షణ యజ్ఞం ప్రారంభించాలి. జీవాన్ని కాపాడండి – జీవవిధ్వంసక రసాయనాలను నిషేధించండి!"

**అజయ్ కుమార్**
**వ్యవసాయ నిపుణులు..**

## మర్రిగూడ మండలంలో భూభారతి రెవిన్యూ సదస్సు ఆకస్మిక తనిఖీ చేసిన నల్గొండ జిల్లా కలెక్టర్



**సూర్య ప్రతినిధి మర్రిగూడ** మర్రిగూడ మండలంలో కుదబక్షపల్లి గ్రామ లో జరిగే భూభారతి రెవెన్యూ సదస్సు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ నిర్వహించారు రైతుల వద్ద స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు సిపిఐ నాయకులు సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎమ్మార్వో శ్రీనివాస్ డిటి చంద్రశేఖర్ సీనియర్ అసిస్టెంట్ శీను నాయక్ పాండురంగారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు

## సంస్థాన్‌లో ఘనంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు




**సంస్థాన్ నారాయణపుర్, జూన్ 20( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల నాయకుడు మునుగోడు ముద్దుబిడ్డ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శీనన్న పుట్టినరోజు సందర్భంగా చౌరస్తా లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. అదేవిధంగా పండ్లుపంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బొల్లపల్లి లక్ష్మణ్, యువజన సంఘం అధ్యక్షులు కొప్పు రామకృష్ణ, ఉపాధ్యక్షులు కొల్లూరి నవీన్, నియోజకవర్గ కార్యదర్శి కట్కూరు శ్రీకాంత్, నియోజవర్గ కార్యదర్శి సుర్వి శ్రీకాంత్ , షరీఫ్, విడం సాయి, వెంకటేష్, లింగస్వామి, అనిల్ ,ప్రదీప్, కైసర్, ప్రకాష్, ఆకాష్, రామ కృష్ణ, యశ్వంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ అదే తప్పు... మళ్లీ..మళ్లీ చేస్తున్నారా

విజయవాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం వస్తున్నారు. అది చూసి తనకు మళ్లీ అధికారం వస్తుందని నమ్ముతున్నారు. అందుకే కొంత నిర్లక్ష్యం జగన్ లో కనపడుతుంది. ఈసారి కూడా తన ఫేస్ ను చూసి మాత్రమే జనం ఓట్లు వేస్తారన్న నమ్మకంతోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. ఎందుకంటే నాయకులతో నిత్యం సమావేశాలు జరపడం, సమీక్షలు నిర్వహించుకోవడం వంటి వాటికి జగన్ నాడు– నేడు దూరమే. అంతా నావల్లనే జరగాలన్న ధోరణిలోనే ఇంకా జగన్ ఉన్నట్లు కనపడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా కార్యక్రమాలను చేపట్టడం ప్రతిపక్ష పార్టీకి అవసరం. ఎందుకంటే ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సింది కూడా ప్రతిపక్షమే.... అయితే ఏడాది నుంచి అనేక కార్యక్రమాలకు వైసీపీ పిలుపు నిచ్చింది. కానీ జగన్ మాత్రం అందులో ప్రత్యక్షంగా పాల్గొనకపోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. అనేక కార్యక్రమాలు చేపట్టినా జగన్ వాటికి దూరంగా ఉండటం, తాను ఒక్క పిలుపు నిస్తే చాలు అన్న వైఖరి జగన్ లో స్పష్టంగా కనపడుతుంది. ఏడాది నుంచి జగన్ రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో బయటకు రావడం, అక్కడక్కడా పరామర్శలు, భరోసా యాత్రలు, వివాహాది శుభకార్యాలకు హాజరు కావడం మినహా జగన్ నేరుగా ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనింది లేదు. అధికారంలోకి రానప్పుడు జగన్ దీక్షలు, ధర్నాలు స్వయంగా చేస్తూ జనానికి దగ్గరయ్యారు. కానీ మాజీ ముఖ్యమంత్రిగా ఆయన ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఈ నెల 4వ తేదీన ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదంటూ వెన్నుపోటు దినం అని జగన్ ప్రకటించారు. అంతవరకూ బాగానే ఉంది. అది కూడా అందరూ నేతలు ఇందులో పాల్గొనాలని కోరారు. తాను మాత్రం బెంగళూరులో ఉన్నారు. ఇది క్యాడర్ లోనూ, ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు వెళుతుందని నేతలు చెబుతున్నారు. అదే జగన్ ఏదో ఒక జిల్లాలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొని ఉంటే కార్యక్రమానికి మంచి హైప్ వచ్చేదని, మీడియా అటెన్షన్ కూడా వచ్చేదని, జగన్ చేజేతులా ఈ అవకాశాలను తానే దూరం చేసుకుంటున్నారని సొంత పార్టీకి చెందిన సీనియర్ నేతలే వ్యాఖ్యానిస్తున్నారంటే జగన్ కు అర్థం కావడంలేదాజగన్ కూడా ఎన్నికలకు కొద్ది రోజులు ముందు మాత్రమే జనంలోకి రావాలని అనుకుంటున్నట్లుంది. అప్పటి వరకూ అడపా దడపా ఏవో కొన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్లడమే మంచిదని భావిస్తున్నారు. నేతలు, క్యాడర్ ను ముందుగా రోడ్డు మీదకు తీసుకు వచ్చి వారిని యాక్టివ్ చేసిన తర్వాత మాత్రమే తాను రంగంలోకి దిగాలని భావిస్తున్నట్లుంది. తాను హాజరయిన కార్యక్రమం సూపర్ సక్సెస్ కావాలని, అది అధికారాన్ని మళ్లీ తెచ్చి పెట్టేలా ఉండాలన్న ఆలోచనతోనే ఆయన ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లుందని పార్టీకి చెందిన సీనియర్ నేతలే అంటున్నారు. అంటే ఒకవేళ గెలిస్తే క్రెడిట్ తన ఖాతాలో పడేలా జగన్ వ్యవహరిస్తున్నారని, అది మంచిది కాదని కొందరు వైసీపీ సానుభూతి పరులు కూడా సూచిస్తున్నారు. అధికారంలోకి రాకముందు ఉన్న పరిస్థితులను, నాడు చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకోవాలని కోరుతున్నారు.

# బిజినెస్

## ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి రాపిడో




నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్య ఒప్పందం ద్వారా రాపిడో రెస్టారెంట్లతో వాణిజ్య నిబంధనలను కుదుర్చుకుంది. 5 లక్షలకు పైగా రెస్టారెంట్లకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వినియోగదారులకు అత్యంత సరసమైన ధరలకు వేగవంతమైన సేవలను అందిస్తున్నట్లు రాపిడో పేర్కొంది.. బైక్, టాక్సీ యాప్ సేవలను అందించే రాపిడో కంపెనీ భారతదేశంలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి ప్రవేశించబోతోంది. కంపెనీ ఈ నిర్ణయం తర్వాత స్విగ్గీ, జొమాటో కఠినమైన సవాలును ఎదుర్కోబోతున్నాయి. స్విగ్గీ, జొమాటోలకు గట్టి పోటీని ఇస్తుంది.నివేదికల ప్రకారం, రెస్టారెంట్లకు చాలా తక్కువ కమీషన్ అందించడం ద్వారా రాపిడో మార్కెట్‌ను పెంచుకోవాలని యోచిస్తోంది. ఆర్డర్ ధర ఆధారంగా రెస్టారెంట్ల నుండి రాపిడో 8-15 శాతం కమీషన్ వసూలు చేస్తుంది. ఈ ధర జొమాటో, స్విగ్గీ 16-30 శాతం కంటే చాలా తక్కువ. నివేదికల ప్రకారం, రాపిడో రూ.400 కంటే తక్కువ ఆర్డర్‌లకు రూ.25, రూ.400 కంటే ఎక్కువ ఆర్డర్‌లకు రూ.50 స్థిర రుసుము వసూలు చేస్తుంది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్య ఒప్పందం ద్వారా రాపిడో రెస్టారెంట్లతో వాణిజ్య నిబంధనలను కుదుర్చుకుంది. చీ=ూ× 5 లక్షలకు పైగా రెస్టారెంట్లకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వినియోగదారులకు అత్యంత సరసమైన ధరలకు వేగవంతమైన సేవలను అందిస్తున్నట్లు రాపిడో పేర్కొంది. ప్రస్తుతం యాప్ బైక్, ఆటో, ఆటో షేర్, పార్సెల్, క్యాబ్ ఎకానమీ, క్యాబ్ ప్రీమియం వంటి సేవలను అందిస్తోంది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి ప్రవేశించిన మొదటి యాప్ రాపిడో కాదు. గతంలో ఓలా 2015లో ఓలా కేఫ్‌ను ప్రారంభించడానికి విజయవంతమైన ప్రయత్నం చేసింది. 2017లో ఫుడ్‌పాండా ఇండియాను కొనుగోలు చేసింది. ఇటీవల ఓలా ప్రభుత్వ మద్దతుగల డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ద్వారా తిరిగి ప్రవేశించింది. అదేవిధంగా ఉబెర్ 2017లో భారతదేశంలో ఉబెర్ ఈట్స్‌ను ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ ప్లాట్‌ఫామ్‌గా ప్రారంభించింది. కానీ అది విజయవంతం కాలేదు. అలాగే ఉబెర్ తన వ్యాపారాన్ని జోమాటోకు విక్రయించడం ద్వారా మార్కెట్ నుండి నిష్క్రమించింది. దీనిలో ఉబెర్ జొమాటోలో 10 శాతం వాటాను పొందింది.

## ఎంఎస్‌ఎంఈలపై మరింత ఫోకస్




త్వరలో పబ్లిక్ ఇష్యూకి వస్తోన్న ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్.. ఎంఎసఎంఈలకు తన సేవలను మరింత విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయంగా, దేశీయంగా తమ వ్యాపారాలను విస్తరించాలనుకునే ఎంఎస్ ఎంఈలకు ప్రత్యేకమైన సేవలందించనున్నట్లు సంస్థ సీఈఓ (డొమెస్టిక్ షిప్పింగ్) సీఈఓ అతుల్ మెహతా చెప్పారు. షిప్‌రాకెట్ పోర్టల్‌పై ఇప్పటికే 3 లక్షల మంది విక్రేతలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా ల నుంచి దాదాపు 18 వేల మంది విక్రేతలు షిప్‌రాకెట్ ద్వారా 2 కోట్లకు పైగా ఉత్పత్తులను విక్రయించారని తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఎసఎంఈలు చేసిన షిప్‌మెంట్స్ 35 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. కాగా కంపెనీ హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 32 వేర్‌హౌసెసను నిర్వహిస్తోందని మెహతా చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఢిల్లీలో డార్క్ స్టోర్స్ పేరుతో క్విక్ కామర్స్ సేవలను ప్రారంభించామని, దశల వారీగా దీన్ని ఇతర నగరాలకు విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే హైదరాబాద్‌లో డ్రోన్ ద్వారా ఉత్పత్తుల డెలివరీని చేపట్టాలని చూస్తున్నట్లు మెహతా తెలిపారు.

# పోస్టాఫీసులో సూపర్ స్కీమ్.. ఇందులో ఇన్వెస్ట్ చేస్తే లక్షాధికారి కావచ్చు!




ఈ పథకం లాక్-ఇన్ పిరియడ్ 5 సంవత్సరాలు. మీరు ఈ పొదుపు పథకంలో పెట్టుబడి పెట్టడానికి మీ ఖాతాను తెరిచి, ఒక సంవత్సరం పాటు ఉంచిన తర్వాత దాన్ని మూసివేస్తే, మీరు చేసిన పెట్టుబడి మొత్తాన్ని మాత్రమే.. ప్రతి ఒక్కరూ తాము కష్టపడి సంపాదించిన డబ్బును సురక్షితమైన, గొప్ప రాబడిని ఇచ్చే ప్రదేశంలో పెట్టుబడి పెట్టాలని కోరుకుంటారు. అందుకే మీరు కూడా ఈ ఆలోచనను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తుంటే, పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలు మీకు గొప్ప ఎంపికగా ఉంటాయి. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు మీకోసం ఒక బలమైన నిధిని సృష్టించుకోవచ్చు. పోస్టాఫీస్ పథకాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. అందుకే అందరూ జాతీయ పొదుపు ధృవీకరణ పత్రం అంటే పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాల చీూజ ని పెట్టుబడికి ఉత్తమమైనదిగా భావిస్తారు. పోస్టాఫీసు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు కేవలం ఐదు సంవత్సరాలలో మీ కోసం మంచి నిధిని నిర్మించుకోవచ్చు. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు దాదాపు రూ.5 లక్షల ప్రయోజనాన్ని పొందవచ్చు. జాతీయ పొదుపు ధృవీకరణ పత్రం పథకం పెట్టుబడిదారులకు మంచి వడ్డీని ఇవ్వడానికి కూడా ప్రసిద్ధి చెందింది. ఈ పథకం దాని రాబడి, ప్రయోజనాల కారణంగా అత్యంత ప్రజాదరణ పొందిన చిన్న పొదుపు పథకాలలో ఒకటిగా ఉంది. జాతీయ పొదుపు ధృవీకరణ పత్రంలో పెట్టుబడి పెట్టడానికి, మీరు ఏదైనా పోస్ట్ ఆఫీస్ పథకంలో కనీసం రూ. 1,000 తో ఖాతాను తెరవవచ్చు. ఈ పథకంలో పెట్టుబడి పెట్టడంపై, పెట్టుబడిపై వార్షికంగా 7.7 శాతం వడ్డీని ఇస్తున్నారు. ఈ పథకం లాక్-ఇన్ పిరియడ్ 5 సంవత్సరాలు. మీరు ఈ పొదుపు పథకంలో పెట్టుబడి పెట్టడానికి మీ ఖాతాను తెరిచి, ఒక సంవత్సరం పాటు ఉంచిన తర్వాత దాన్ని మూసివేస్తే, మీరు చేసిన పెట్టుబడి మొత్తాన్ని మాత్రమే తిరిగి పొందగలరు. మీరు వడ్డీ ప్రయోజనాన్ని పొందే అవకాశాన్ని కోల్పోవచ్చు. మీరు 1 లక్ష డిపాజిట్ చేసినట్లయితే 5 సంవత్సరాల తర్వాత మీకు దాదాపు 1.45 లక్షలు లభిస్తాయి. ఈ పథకంలో, మీరు మీ పిల్లల పేరు మీద కూడా సులభంగా ఖాతాను తెరవవచ్చు. ఈ పథకం నిబంధనల ప్రకారం, మీరు 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల పేరు మీద ఖాతా తెరిస్తే, తల్లిదండ్రులు ఖాతాను నిర్వహిస్తారు. పోస్టాఫీసులోని నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో 5 సంవత్సరాల పాటు ఒకేసారి రూ. 5 లక్షలను డిపాజిట్ చేయడం ద్వారా పెట్టుబడిదారులు చాలా ప్రయోజనం పొందవచ్చు. దీనిపై ప్రస్తుత వడ్డీ రేటు సంవత్సరానికి 7.7%. ఈ పథకంలో ప్రతి సంవత్సరం మీ డిపాజిట్ మొత్తానికి వడ్డీ జోడిస్తారు. తరువాతి సంవత్సరంలో మీరు ఆ పెరిగిన మొత్తంపై వడ్డీని పొందుతారు. ఉదాహ రణకు మొదటి సంవత్సరంలో 5 లక్షలపై రూ.38,500 వడ్డీ మొత్తాన్ని రూ.5,38,500. అదేవిధంగా ప్రతి సంవత్సరం వడ్డీని జోడించడం ద్వారా 5 సంవత్సరాలు పూర్తయిన తర్వాత మొత్తం రూ.7,24,513 అవుతుంది. మీరు మొత్తం రూ.2,24,513 నికర లాభం పొందవచ్చు.

# నాలుగో రోజూ లాభాలొచ్చాయ్



భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు గతవారం ఆర్‌బీఐ రెపో రేటును 0.50 శాతం తగ్గించిన నేపథ్యంలో మదుపరులు వడ్డీ రేట్ల ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, వాహనం, క్యాపిటల్ గూడ్స్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 480 పాయింట్ల వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 256.22 పాయింట్ల లాభంతో 82,445.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 100.15 పాయింట్ల వృద్ధితో 25,103.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి ఈ ఏడాదిలో ఇదే గరిష్ఠ ముగింపు స్థాయి. లలిత జువెలరీ రూ.1,700 కోట్ల ఐపీఓ: తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో షోరూమ్‌లను నిర్వహిస్తున్న స్వర్ణ, వజ్రాభరణాల విక్రయ సంస్థ లలిత జువెలరీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందు కు అనుమతి కోరుతూ మార్కెట్ నియం త్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసా యిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పిం చింది. ఐపీఓలో భాగంగా మొత్తం రూ.1,700 కోట్లు సమీకరించాలనుకుం టున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో వెల్లడించింది. అందులో రూ.1,200 కోట్లు తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్ కిరణ్ కుమార్ జైన్ రూ.500 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

# క్రీడల్ని ప్రేమించే నగరంలో తొక్కిసలాట.. నా మనసుకెంతో బాధగా ఉంది!




భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద ప్రమాదమైన చిన్నస్వామి తొక్కిసలాటపై రాహుల్ ద్రవిడ్ స్పందించాడు. జూన్ 4 బుధవారం జరిగిన ఈ ఘటనలో 11 మంది మరణించడం తనను ఎంతగానో బాధించిందని అన్నాడీ లెజెండ్. చిన్నస్వామి తొక్కిసలాటను దురదృష్టకరమైనదిగా పేర్కొన్న ద్రవిడ్.. తమ అభిమాన జట్టు విక్టరీ పరేడ్‌ను చూద్దామని వచ్చిన ఫ్యాన్స్ అసువులు బాయడం తన మనసును చాలా బాధిస్తోందని అన్నాడు. 'క్రీడల్ని ఎంతగానో ప్రేమించే నగరం బెంగళూరు. నేను అక్కడి నుంచే వచ్చాను. అక్కడి ప్రజలు క్రికెట్ ఒక్కటే కాదు అన్ని ఆటల్ని చాలా ఇష్టపడుతారు. ఫుట్‌బాల్ జట్టు అయినా.. కబడ్డీ జట్టు అయినా సరే చాలా మద్దతిస్తారు. ఆర్సీబీ అయితే చాలా పాపులర్. ఎక్కువమంది అభిమానులున్న జట్టు కూడా. అలాంటి సిటీలో ఇంత దారుణం జరగడం దురదృష్టకరం. తొక్కిసలాట విషయం తెలిసి షాకయ్యాను. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వాళ్లకు సంతాపం తెలియజేస్తున్నా. ఈ ప్రమాదంలో గాయపడిన వాళ్లు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని ద్రవిడ్ వెల్లడించాడు.


**బెంగళూరుకు వలస**

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జన్మించాడు రాహుల్ ద్రవిడ్. వాళ్లది మరాఠీ బ్రాహ్మణ కుటుంబం. అతడి చిన్నతనంలోనే వాళ్ల కుటుంబం బెంగళూరుకు వలస రావడంతో అతడు అక్కడే పెరిగాడు. దాంతో, ద్రవిడ్ దేశవాళీ క్రికెట్‌లో కర్నాటక తరపున అరంగేట్రం చేశాడు. అందుకే.. అతడికి బెంగళూరు అంటే చాలా ఇష్టం. పైగా ఐపీఎల్ ఆరంభంలో అతడు ఆర్సీబీకి ఆడాడు. ప్రస్తుతం ఈ దిగ్గజ క్రికెటర్ రాజస్థాన్ రాయల్స్ (%=ఖుయిుర్ష్ణఅ =శీఖుత్రీం%) జట్టుకు హెడ్‌కోచ్‌గా సేవలందిస్తున్నాడు.

**2.5 లక్షల మంది రాకతో..**

ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి కప్ కోసం నిరీక్షిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18వ సీజన్‌లో ఛాంపియన్‌గా అవతరించింది. ఉత్కంఠ రేపిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై జయభేరి మోగించి తమ ఐపీఎల్ ట్రోఫీ కలను సాకారం చేసుకుంది. తమ అభిమాన జట్టు విజేతగా నిలవడంతో బెంగళూరు అభిమానులు పొంగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆర్సీబీ విక్టరీ పరేడ్‌కు పెద్ద సంఖ్యలో కదిలారు. అయితే.. చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35 వేలు కాగా.. దాదాపు 2.5 లక్షల మంది వచ్చారు. దాంతో.. పోలీసులు అభిమానులను అదుపు చేయలేకపోయారు. సాయంత్రం ఒక్కసారిగా మైదానం గేట్లు తెరవడంతో ఫ్యాన్స్ భారీ కేడ్లు ఎక్కిమరీ లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా.. 56 మంది గాయపడ్డారు. ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేసిన కర్నాటక సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. కర్నాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ కంపెనీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోడం.. భద్రతాపరమైన ఏర్పాట్లు చేయకపోవడమే ఈ తొక్కిసలాటకు ఒక కారణం. దాంతో.. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సెక్రటరీ ఏ శంకర్, కోశాధికారి ఈఎస్ జైరామ్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు. అంతేకాదు.. తొక్కిసలాట విషయమై ఆర్సీబీ యాజమాన్యంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే.

## టీమిండియావైపు దూసుకొస్తున్న నయా ఫాస్ట్ బౌలింగ్ సంచలనం



తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల నయా ఫాస్ట్ బౌలింగ్ సంచల నం ఆర్ డి ప్రణవ్ రాఘవేంద్ర తనకు మాత్రమే సాధ్యపడు తున్న అసాధారణ వేగంతో బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నాడు. ఇటీవల జరిగిన ఓ టోర్నీలో గంటకు 147.3 కిమీ వేగంతో బంతిని సంధించి వార్తల్లో నిలిచాడు. భారత అండర్-19 క్రికెట్ చరిత్రలో ఇదే అత్యంత వేగవంతమైన బంతిగా రికార్డైంది. గత కొంతకాలంగా ప్రణవ్ ఇంచుమించు ఇదే స్పీడ్‌ను మెయిన్‌టైన్ చేస్తున్నాడు. ప్రణవ్ ఇదే కొనసాగిస్తే త్వరలో గంటకు 150 కిమీ స్పీడ్‌ను కూడా అందుకునే అవకాశం ఉంది. భారత ఫాస్ట్ బౌలింగ్‌కు సంబంధించి గంటకు 150 కిమీ స్పీడ్ అనేది చాలా అరుదైన మైలురాయి. భారత ఫాస్ట్ బౌలర్లు ఈ స్పీడ్‌ను అంత ఈజీగా అందుకోలేరు. ఇప్పటివరకు మనం చూసిన వారిలో ఉమ్రాన్ మాలిక్, మయాంక్ యాదవ్ వంటి వారు ఈ స్పీడ్ పరిసరాల్లోకి చేరారు. ఈ స్పీడ్‌ను చేరుకోవడం? ఓ ఎత్తైతే, దీన్ని నిలకడగా ప్రదర్శించడం మరో ఎత్తు. దీన్ని మెయింటైన్ చేయడం చాలా కష్టం. స్పీడ్‌ను సాధించే క్రమంలో తీవ్రమైన గాయాలవుతుంటాయి. ఒక్కోసారి కెరీర్‌లే అర్ధంతరంగా ముగిసిపోతుంటాయి. తాజాగా ఈ స్పీడ్‌ను అందుకొని, మెయింటైన్ చేయగల సామర్థ్యమున్న ఫాస్ట్ బౌలర్‌గా ప్రణవ్ కనిపిస్తున్నాడు. 150 కిమీ వేగాన్ని అందుకున్న వారిలో ప్రణవ్ అతి పిన్న వయస్కుడు. రెండేళ్లలో ప్రణవ్ 130 నుంచి 147 కిమీ వరకు వేగాన్ని పెంచుకోగలిగాడు. ఇదే అతనిపై అంచనాలను పెంచుతుంది. త్వరలో ఇంగ్లండ్‌లో పర్యటించబోయే భారత అండర్-19 జట్టుకు ఎంపికైన ప్రణవ్.. అదే పర్యటనలో గంటకు 150 కిమీ వేగాన్ని అందుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని అతని చూసిన వారంటున్నారు. ఈ చెన్నై స్పీడ్ గన్ ఇంగ్లండ్ పర్యటనలో రెండు టెస్ట్‌లు, ఐదు వన్డేలు ఆడనున్నాడు. ఈ సిరీస్‌లు జూన్ 27 నుంచి మొదలుకానున్నాయి. ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణలో ఉన్న ప్రణవ్ తన భవిష్యత్ లక్ష్యాల గురించి మాట్లాడుతూ ఇలా అన్నాడు. నాకు వేగంగా బౌలింగ్ చేయడమంటే చాలా ఇష్టం. రాకాసి బౌన్సర్లతో బ్యాటర్లను భయపెట్టడాన్ని చాలా ఇష్టపడతాను. విపరీతమైన వేగంతో బ్యాటర్ల గ్లోవ్స్‌ను టార్గెట్ చేస్తుంటే చాలా గొప్పగా అనిపిస్తుంది. ఈ స్పీడ్‌ను కొనసాగించేందుకు ఖచ్చితత్వంతో సహా చాలా అంశాలపై పని చేయాలి. టీమిండియాకు ఆడటమే నా లక్ష్యమని అన్నాడు.

# స్పోర్ట్స్

## టీమిండియా జాక్‌పాట్.. పాపం పాకిస్థాన్!




ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విజేత ఎవరో తేలిపోయే సమయం ఆసన్నమైంది. లండన్‌లోని లార్డ్స్ మైదానంలో బుధవారం నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా టైటిల్ కోసం బరిలోకి దిగనున్నాయి. గత రెండు ఎడిషన్లతో పోలిస్తే ఈసారి విజేతకు రెండింతల ఎక్కువ ప్రైజ్‌మనీ దక్కుతుంది. టెస్ట్ క్రికెట్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రైజ్‌మనీని భారీగా పెంచింది ఐసీసీ. డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచే జట్టుకు ఈసారి 3.6 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 30.8 కోట్లు) ప్రైజ్‌మనీ సొంతమవుతుంది. రన్నరప్‌కు 2.1 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 17.9 కోట్లు) నగదు బహుమతి అందుతుంది. హ్యాట్రిక్ ఫైనల్ మిస్సయి 3వ స్థానంలో నిలిచిన టీమిండియా కూడా భారీగానే ప్రైజ్‌మనీ అందుకోబోతోంది. మూడో స్థానంలో నిలిచినప్పటికీ గత రెండు ఎడిషన్ల విజేతల కంటే ఎక్కువ సొమ్మును భారత్ దక్కించుకోబోంది. 1.44 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 12.34 కోట్లు) నగదు బహుమతి పొందనుంది. పాయింట్ల పట్టికలో 4వ స్థానంలో నిలిచిన న్యూజిలాండ్‌కు 1.2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 10.26 కోట్లు) ప్రైజ్‌మనీ వస్తుంది.

**పాపం పాకిస్థాన్!**

పాకిస్థాన్ క్రికెట్ జట్టు పరిస్థితి రానురాను మరింత దయనీయంగా తయారవుతోంది. డబ్ల్యూటీసీ సైకిల్ 2023-2025లో పాక్ టీమ్ చివరి స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో బంగ్లాదేశ్, వెస్టిండీస్ కన్నా తక్కువ మొత్తం ఆ జట్టుకు దక్కుతుంది. బంగ్లాదేశ్ 7.2 లక్షల డాలర్లు (దాదాపు రూ. 6.16 కోట్లు), వెస్టిండీస్ 6.1 లక్షల డాలర్లు (సుమారు రూ. 5.21 కోట్లు) నగదు బహుమతిగా అందుకోనున్నాయి. పాకిస్థాన్‌కు దాదాపు 4.1 కోట్ల రూపాయల (4.8 లక్షల డాలర్లు) నగదు మాత్రమే దక్కనుంది. పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ 7, వెస్టిండీస్ 8 స్థానాల్లో నిలవగా, పాకిస్థాన్ చివరిదైన 9వ స్థానంలో ఉంది. డబ్ల్యూటీసీ సైకిల్ 2023-2025 పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్, శ్రీలంక ఐదారు స్థానాల్లో నిలిచాయి. ఇంగ్లండ్ 9.6 లక్షల డాలర్లు (సుమారు రూ. 8.21 కోట్లు), శ్రీలంక 8.4 లక్షల డాలర్లు (దాదాపు రూ. 7.18 కోట్లు) నగదు బహుమతి అందుకుంటాయి. కాగా, 2019-21లో న్యూజిలాండ్, 2021-23లో ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ టైటిల్ గెలిచిన సంగతి తెలిసిందే. ఈ రెండు జట్లు ఇండియాపైనే గెలవడం గమనార్హం.




## ‘కన్నప్ప’ ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్!

మంచు ఫ్యామిలీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కన్నప్ప చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్ అప్డేట్‌ను పంచుకున్నారు. కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చారిత్రక చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్రతారలు కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో రాబోతున్న చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమా ట్రైలర్‌ను శుక్రవారం(జూన్ 13) రోజున విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది.

## సముద్ర అందాలను ఆస్వాదిస్తున్న జాక్వెలిన్ ఫెర్నాండేజ్






## డ్యూయల్ రోల్‌లో కార్తీ.. ‘సర్దార్ 2’ సమాప్తం!

‘సర్దార్’ సీక్వెల్ ‘సర్దార్ 2’ షూటింగ్ సమాప్తం అయింది. హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందిన స్పై యాక్షన్ డ్రామా ‘సర్దార్’. 2022 అక్టోబరులో విడుదలైన ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. తాజాగా కార్తీ, పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లోనే ‘సర్దార్’ సినిమాకు సీక్వెల్‌గా ‘సర్దార్ 2’ రానుంది. ఈ సీక్వెల్ చిత్రీకరణ పూర్తయినట్లుగా మేకర్స్ వెల్లడించారు. కార్తీ టైటిల్ రోల్‌లో నటించిన ఈ చిత్రంలో మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించగా, ఎస్‌జే సూర్య పవర్‌ఫుల్ పాత్రలో నటించారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ సినిమాను నిర్మించారు. “పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం” అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇక ‘సర్దార్’ సినిమాలో తండ్రీకొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేశారు. సీక్వెల్‌లోనూ ద్విపాత్రాభినయం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా.

## మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైన కత్రినా కైఫ్




పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఆ కలని కొందరు సాకారం చేసుకుంటున్నారు. అయితే ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ (%వీపీ=జ%) తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా కైఫ్ గ్లోబల్ అంబాసడర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు.




## ఉస్తాద్ భగత్ సింగ్ యాక్షన్‌కి టైమ్ ఫిక్స్.. షెడ్యూల్ ఎన్ని రోజులు అంటే..!

రాజకీయాల వలన కొన్నాళ్ల పాటు సినిమా షూటింగ్స్‌కి దూరంగా ఉన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు తను కమిటైన ప్రాజెక్ట్‌లు పూర్తి చేసే పనిలో పడ్డారు. దాదాపు రెండేళ్ల క్రితం మేనల్లుడు సాయి దుర్గా తేజ్ తో కలిసి ‘బ్రో అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన పవన్ ఆ తర్వాత వెండితెరపై కనిపించింది లేదు. జూలై 28, 2023లో పవన్ చివరి చిత్రం విడుదల అయ్యింది . అయితే ‘హరి హర వీరమల్లు’తో ఈ నెల 12న థియేటర్లలోకి వస్తారని పవన్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. కాని పలు కారణాల వలన ఈమూవీ మళ్లీ పోస్ట్ పోన్ అయింది. మరోవైపు తాను కమిట్ అయిన ఓజీ చిత్ర షూటింగ్ కూడా పూర్తి చేసినట్టు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయనున్నారు. పవన్ కమిటైన మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. గబ్బర్ సింగ్ చిత్రం తర్వాత హరీష్, పవన్ కాంబోలో రూపొందుతున్న ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకి దీనిపై హరీష్ శంకర్ క్లారిటీ ఇచ్చారు. ఇటీవల కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న హరీశ్ శంకర్ జూన్ రెండవ వారంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు కోసం తిరుమలకు వచ్చామని హరీష్ తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో వస్తున్న అవైటెడ్ మాస్ మసాలా ఎంటర్టైనర్ “ఉస్తాద్ భగత్ సింగ్” చిత్రం చాలా కాలం గ్యాప్ తర్వాత ఫుల్ లెంగ్త్ షెడ్యూల్ షూటింగ్ కి సిద్ధం అయ్యింది. ఈరోజు (జూన్ 10) నుంచి హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో పునః ప్రారంభం అయ్యినట్టు సమాచారం. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ లేని సన్నివేశాలతో షూటింగ్ ప్రారంభించినట్టు తెలుస్తుండగా, జూన్ 12 లేదా 13వ తేదీన పవన్ సెట్స్ లో జాయిన్ అవుతారని టాక్. ఈ షెడ్యూల్ మొత్తం 30 రోజుల పాటు జరగనుంది. చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.